


కడప మహానాడు తొలిరోజు

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
J V NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2 సంచిక -78 బుధవారం 28 మే 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -8 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# రైతులకే అధిక ప్రాధాన్యం



## మంత్రులు, అధికారులతో సిఎం రేవంత్ వీడియో కాన్ఫరెన్స్

- భూభారతి పేద రైతులకు చుట్టం
- ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి
- జూన్ 3 నుంచి 20 వరకు మూడోదశ రెవెన్యూ సదస్సులు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని వాడాలి
- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- ధాన్యం కొనుగోళ్లలో దుష్ప్రచారాలను ఎండగట్టాలి



హైదరాబాద్,మే27(జర్నలిస్ట్ వార్త): భూభారతి పేద రైతులకు చుట్టమని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. జూన్ 3 నుంచి 20 వరకు మూడో దశ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మంత్రులు, అధికారులతో సిఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రులు, ఉన్నతాధికారులు, కలెక్టర్లు హాజరయ్యారు. ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతిపై ఈ సమీక్షలో చర్చించారు. ఇందిరమ్మ ఇళ్లకు మేస్త్రీ ఛార్జీలు, క్రషర్ ధరలను పర్యవేక్షించాలని సిఎం అన్నారు. మండలస్థాయిలో ధరల నియంత్రణ కమిటీ వేయాలని పేర్కొన్నారు. ఉచిత ఇసుక కూపన్లు సకాలంలో సరఫరా చేయాలని తెలిపారు. ఇటుక తయారీ, సెంట్రింగ్ యూనిట్ల ఏర్పాటుకు రుణాలు ఇవ్వాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రాక్టికల్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కొత్త టెక్నాలజీని వాడాలని సూచించారు. 29, 30 తేదీల్లో ఇన్‌ఛార్జ్ మంత్రులు మిగతాది 2లో...

## భారత్ సొంత స్టెల్త్ ఫైటర్ జెట్ తయారీకి గ్రీన్ సిగ్నల్!

- భారత్ సొంత స్టెల్త్ ఫైటర్ జెట్
- తయారీకి రక్షణ శాఖ ఆమోదం
- ఏడీఏ ఆధ్వర్యంలో ఐదో తరం యుద్ధ విమానాల రూపకల్పన
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో ప్రాజెక్టు అమలు



## రెండో విడత పద్మ పురస్కారాలు

- శోభనకు పద్మభూషణ్, మందకృష్ణకు పద్మశ్రీ ప్రదానం
- ఢిల్లీలో ఘనంగా పద్మ పురస్కారాల కార్యక్రమం
- నటి శోభనకు పద్మభూషణ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణకు పద్మశ్రీ



ఢిల్లీ మే27(జర్నలిస్ట్ వార్త): దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం సాయంత్రం పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా హాజరై, వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందజేశారు. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం మొత్తం ఏడుగురికి పద్మవిభూషణ్, 19 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా, తొలి విడతలో నందమూరి బాలకృష్ణ, డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి వంటి తెలుగు ప్రముఖులతో పాటు మిగతాది 2లో...

## రాజీవ్ యువ వికాసం పథకం.. 5 లక్షల మందికి లబ్ధి

- డిప్యూటీ సీఎం కీలక ప్రకటన
- జూన్ 2 నుంచి 9 వరకు మంజూరు పత్రాల పంపిణీకి నిర్ణయం
- జూన్ 15 తర్వాత యూనిట్ల గ్రౌండింగ్ ప్రారంభం
- అక్టోబర్ 2 నాటికి 5 లక్షల మందికి లబ్ధి చేకూర్చేలా ప్రణాళిక
- తొలి దశలో లక్ష రూపాయలలోపు యూనిట్లకు ప్రొసీడింగ్స్ జారీ



హైదరాబాద్,మే27(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్రంలో రాజీవ్ యువ వికాసం పథకం అమలు తీరుపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ పథకం ద్వారా యువతకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వేగవంతం చేయాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

సమావేశం అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన మంజూరు పత్రాలను మిగతాది 2లో...

# థియేటర్లలో తనిఖీలు

- పవన్ ఆదేశాలతో వెంటనే రంగంలోకి అధికారులు...
- టికెట్ ధరల గురించి ఫిల్మ్ ఛాంబర్ ద్వారానే రావాలని స్పష్టీకరణ
- తన సినిమాకు కూడా ఇదే వర్తిస్తుందన్న డిప్యూటీ సీఎం
- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో థియేటర్లపై అధికారుల దృష్టి
- కాకినాడ సినిమా రోడ్డులోని థియేటర్లలో ఆర్డీవో, ఎమ్మార్వోల తనిఖీలు
- తినుబండారాల అధిక ధరలు, నాణ్యతపై పవన్ ఆరా
- సినిమా హాళ్లలో గుత్తాధిపత్యంపై విచారణకు మంత్రికి సూచన
- ధరలు తగ్గితే ప్రేక్షకులు పెరుగుతారని, ప్రభుత్వానికి ఆదాయమన్న పవన్



హైదరాబాద్,మే27(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఇచ్చిన ఆదేశాలతో అధికార యంత్రాంగంలో చలనం వచ్చింది. సినిమా హాళ్లలో తినుబండారాల అధిక ధరలు, నిర్వహణ లోపాలపై ఆయన దృష్టి సారించడంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా కాకినాడలో ఈ తనిఖీల ప్రభావం స్పష్టంగా కనిపించింది.

కాకినాడ సినిమా రోడ్డులో ఉన్న చాణక్య, చంద్రగుప్త థియేటర్లలో ఆర్డీవో, ఎమ్మార్వోలు, పోలీసు, అగ్నిమాపక సిబ్బంది బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పెద్దపూడి, కాజులూరు, తాళ్లరేవు, కరప, కాకినాడ, కాకినాడ రూరల్ ఎమ్మార్వోలు పాల్గొన్నారు. రాష్ట్రంలోని సినిమా హాళ్ల నిర్వహణను పకడ్బందీగా మార్చి, ప్రేక్షకులకు మెరుగైన సేవలు అందించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇటీవల స్పష్టం చేసిన విషయం తెలిసిందే. సినిమా హాళ్ల బంద్ ప్రకటన నేపథ్యంలో, మిగతాది 2లో...

# హైకోర్టుకు ముగ్గురు జడ్జీలు

- కర్నాటక హైకోర్టు నుంచిజస్టిస్ సుమలత, జస్టిస్‌లలితా కన్నెగంటి,
- పాట్నాహైకోర్టు నుంచి జస్టిస్‌అభిషేక్‌రెడ్డి బదిలీ
- రాష్ట్రహైకోర్టు నుంచి కలకత్తాహైకోర్టుకు జస్టిస్ సుజయ్‌పాల్
- సుప్రీంకోర్టు కొలీజియంసిఫారసు



# కార్యకర్తే అధినేత..!



కడప మహానాడు తొలిరోజు ప్రసంగంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు.



## జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు... కేటీఆర్ పిలుపు



- జూన్ 2న తెలంగాణ భవన్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహణ
- జాతీయ పతాకం, పార్టీ పతాకాలు ఎగురవేయాలని కేటీఆర్ పిలుపు
- అన్ని జిల్లా కార్యాలయాలు, నియోజకవర్గాల్లోనూ సంబరాలు

## రెండో విడత పద్మ పురస్కారాలు

(మొదటి పేజీ తరువాయి)
మొత్తం 71 మందికి ఏప్రిల్ 28న పురస్కారాలు ప్రదానం చేశారు. తాజాగా జరిగిన రెండో విడత కార్యక్రమంలో మరికొందరు ప్రముఖులు ఈ గౌరవాన్ని అందుకున్నారు.
ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీనటి శోభన పద్మభూషణ్ పురస్కారాన్ని స్వీకరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పద్మశ్రీ అవార్డును ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వి. రాఘవేంద్రాచార్య పంచముఖి (సాహిత్యం, విద్య), ప్రొఫెసర్ కేఎల్ కృష్ణ (సాహిత్యం, విద్య) కూడా రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారాలను అందుకున్నారు. ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్‌కు పద్మభూషణ్ పురస్కారం లభించింది.

## రాజీవ్ యువ వికాసం పథకం..

(మొదటి పేజీ తరువాయి)
జూన్ 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం, జూన్ 15వ తేదీ తర్వాత ఎంపికైన యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా 5 లక్షల మంది యువతకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో ప్రణాళిక రూపొందించినట్లు భట్టి విక్రమార్క వివరించారు.
మంత్రి సీతక్క మాట్లాడుతూ, తొలి విడతలో భాగంగా లక్ష రూపాయలలోపు విలువ గల చిన్న యూనిట్లకు ప్రాధాన్యతనిస్తూ ప్రొసీడింగ్స్ జారీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా యువత ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఆమె పేర్కొన్నారు.

## వర్షాకాలం.. అప్రమత్తం



హైదరాబాద్,మే27(జర్నలిస్ట్ వార్త):
హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని సిఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించా రు. భారీ వర్షాలు పడుతాయని వాతావర ణ శాఖ ఇచ్చిన సూచనలకు అనుగుణంగా తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సిఎం రేవంత్ సూచించారు. హైదరాబాద్ పరిధిలో అన్ని విభాగాల అధికారులు అం దుబాటులో ఉండాలని, జీహెచ్ఎంసీ, పో లీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆయన ఆదేశించారు. రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని, ట్రాఫిక్ ఇబ్బంది, విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని సిఎం ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా, ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సిఎం పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. గ్రేటర్ సిటీతో పాటు అన్ని జిల్లాల్లో ఎప్పటికప్పుడు వర్షాల పరిస్థితిని సమీక్షించాలని సిఎస్ ను ముఖ్యమంత్రి ఆదేశించారు.
సీజనల్ వ్యాధులు, జ్వరాలు రాకుండా చర్యలు చేపట్టాలి
ముందుగా వచ్చిన వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు, జ్వరాలు వచ్చే ప్రమాదముంటుందని ముఖ్యమంత్రి వైద్య ఆరోగ్య శాఖను సిఎం రేవంత్ అప్రమత్తం చేశారు. ప్రధానంగా ఏజెన్సీ ఏరియాలు, అటవీ ప్రాంతాలున్న జిల్లాల కలెక్టర్లు ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని సిఎం ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు కూడా నమోదవుతున్నాయని, అన్ని జిల్లాల్లోనూ సీజన్‌కు అనుగుణంగా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిఎం ఆదేశించారు.

## జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ వేడుకలు... కేటీఆర్ పిలుపు



హైదరాబాద్,మే27(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జూన్ 2వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు జరుగుతాయని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా పార్టీ కార్యాలయాలతో పాటు, నియోజకవర్గాలు, మున్సిపాలిటీలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో జాతీయ జెండాను, పార్టీ పతాకాన్ని ఎగురవేసి, ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున సంబరాలు జరపాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.తెలంగాణ భవన్‌లో జరిగే ప్రధాన కార్యక్రమంలో పార్టీ వ్యవస్థాపక సభ్యులు, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి పాల్గొని జాతీయ పతాకాన్ని, పార్టీ జెండాను ఆవిష్కరిస్తారని వెల్లడించారు. ఈ వేడుకల్లో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.అదేవిధంగా, రాష్ట్రంలోని అన్ని జిల్లా పార్టీ కార్యాలయాల్లో జిల్లా అధ్యక్షుల నేతృత్వంలో జాతీయ జెండాతో పాటు పార్టీ జెండాలను ఎగురవేసి సంబరాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా కేంద్రాలతో పాటు అన్ని నియోజకవర్గాలు, మున్సిపాలిటీలు, పట్టణాలు, మండలాల్లోనూ జాతీయ పతాకాన్ని, గులాబీ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ అవతరణ సంబరాలను ప్రజలతో కలిసి జరుపుకోవాలని కేటీఆర్ అన్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "14 ఏళ్ల అలుపెరగని పోరాటం, ఉద్యమ రథసారథి కేసీఆర్ సారథ్యంలో సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలి" అని తెలిపారు. అమరుల త్యాగాలు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థుల పోరాటాలు, సబ్బండ వర్గాల సమష్టి కృషితోనే ఆరు దశాబ్దాల కల సాకారమైందని ఆయన గుర్తు చేశారు."కొట్లాడి సాధించుకున్న తెలంగాణ తొలి పదేళ్ల ప్రస్థానం యావత్ దేశానికే ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రతి ఆలోచన అనేక రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర ప్రభుత్వానికి కూడా దిక్సూచిగా నిలిచింది" అని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై పురుడు పోసుకున్న రైతుబంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలు దేశానికే దారిచూపే దీపస్తంభాల్లా నిలవడం ప్రతి తెలంగాణ బిడ్డకూ గర్వకారణమని ఆయన స్పష్టం చేశారు. పార్టీ సీనియర్ నాయకులు, శ్రేణులంతా ఈ వేడుకల్లో పాల్గొని, ప్రజలతో కలిసి అవతరణ వేడుకలను విజయవంతం చేయాలని కేటీఆర్ కోరారు.

# రైతులకే అధిక ప్రాధాన్యం



(మొదటి పేజీ తరువాయి)
జిల్లాల్లో పర్యటించాలని ఆదేశించారు.ఈసారి 15 రోజుల ముందే రుతుపవనాలు వచ్చాయన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యధికంగా 64 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. ఇప్పటివరకు 90 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని ఈ సందర్భంగా అధికారులు, కలెక్టర్లను అభినందిస్తున్నానన్నారు. రుతుపవనాలు ముందుగా రావడంతో మిగతా ధాన్యం సేకరించడం ఇబ్బందిగా మారింది.. ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు రైతులకు రూ. 12184 కోట్లు- చెల్లించాం.. గతంలో ఎప్పుడూ లేని విధంగా ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని తెలిపారు. చేసిన మంచి పనిని చెప్పుకోకపోవడం వల్లే చిన్న చిన్న సంఘటనలు ప్రచారంలోకి వస్తున్నాయి.. కొన్నిచోట్ల రాజకీయ ప్రేరేపిత సంఘటనలు జరుగుతున్నాయి.. అనారోగ్యంతో రైతు చనిపోతే ధాన్యం కొనుగోలు వల్లనే అని దుష్ప్రచారం చేశారు.. కలెక్టర్లు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు వివరాలను వెల్లడించాలి.. కలెక్టర్లు ప్రో యాక్టివ్ గా ఉండాలి.. వైఫల్యాలు ఉంటే సరిదిద్దుకోవాలి.. తప్పుడు ప్రచారం చేస్తే వివరణ ఇవ్వండి.. చిన్న చిన్న సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించండి.. ఒక్క నిముషం వృధా చేయొద్దు.. నిర్లక్ష్యం వహించొద్దు.. అవసరమైతే లోకల్ గోడౌన్స్ హైర్ చేయండి.. మిల్లర్లు, దళారులు రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసారి 29 శాతం వర్షపాతం అధికంగా ఉంది.. సీజన్ ముందు రావడంతో వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి.. రైతులకు విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయి.. పంటల వివరాలు, స్థానిక అవసరాలను గుర్తించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి.. నకిలీ విత్తనాలు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.. అవసరమైతే అలాంటి వారిపై పీడీ యాక్ట్ పెట్టండి.. నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి.. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలి.. జిల్లాలవారిగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియనించుకోండి.. భూభారతి పేద రైతులకు చుట్టం.. భూభారతిపై అవగాహన సదస్సులు నిర్వహించాలి.. భూభారతి చట్టాన్ని ప్రజలకు చేరువ చేయండి.. జూన్ 3 నుంచి 20 వరకు మూడో దశ రెవెన్యూ సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు చాలా కీలకం.. క్షేత్రస్థాయిలో బాగా జరగాలంటే అది కలెక్టర్ల చేతిలోనే ఉంది.. మండలస్థాయిలో ధరల నియంత్రణ కమిటీ- వేయాలి.. మేస్త్రీ చార్జీలు, క్రషర్ ధరలను పర్యవేక్షించాలి.. ఉచిత ఇసుక కూపన్లు సకాలంలో సరఫరా చేయాలి.. ఇటు-క తయారీ, సెంట్రింగ్ యూనిట్స్ ఏర్పాటు-కు రుణాలు అందించండి..29, 30 తేదీల్లో జిల్లాల.. ఇంచార్జ్ మంత్రులు సంబంధిత జిల్లాల్లో పర్యటించాలి.. జూన్ 1 నాటికి పూర్తి నివేదిక అందించాలి.. జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించాలని అన్నారు.

# థియేటర్లలో తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)
సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తమ శాఖ చేపట్టిన చర్యలను పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ పలు కీలక సూచనలు చేశారు.ఆంధ్రప్రదేశ్‌లో సినిమా హాళ్ల నిర్వహణను పటిష్టంగా చేపట్టి, ప్రేక్షకులకు నాణ్యమైన సేవలు అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. పవన్ తో సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ సమావేశమయ్యారు. సినిమా హాళ్ల బంద్ ప్రకటన, ఆ తర్వాత శాఖాపరంగా తీసుకున్న చర్యల గురించి పవన్ కు దుర్గేశ్ వివరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు.కొత్త సినిమాల విడుదల సమయంలో టికెట్ ధరల పెంపు కోసం నిర్మాతలు వ్యక్తిగతంగా కాకుండా, తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి (ఫిల్మ్ ఛాంబర్) ద్వారానే ప్రభుత్వాన్ని సంప్రదించేలా పటిష్టమైన విధానాన్ని అమలు చేయాలని పవన్ స్పష్టం చేశారు. త్వరలో విడుదల కానున్న తన చిత్రం 'హరిహర వీరమల్లు'కు కూడా ఇదే నిబంధన వర్తిస్తుందని, నిర్మాత నేరుగా కాకుండా ఫిల్మ్ ఛాంబర్ ద్వారానే ధరల పెంపు ప్రతిపాదనలు పంపాలని తేల్చిచెప్పారు. టికెట్ ధరలు, సినిమా హాళ్ల నిర్వహణ వంటి ఏ విషయంలోనైనా ప్రభుత్వ శాఖలు తమ విధులను కచ్చితంగా నిర్వర్తించాలని సూచించారు.
సినిమా హాళ్లలో టికెట్ ధరలతో పాటు తినుబండారాలు, శీతల పానీయాలు, చివరికి వాటర్ బాటిల్ ధరలు కూడా అధికంగా ఉండటంపై సమావేశంలో చర్చ జరిగింది. వీటి వాస్తవ ధరలు, విక్రయ ధరలు, నాణ్యతా ప్రమాణాలపై సంబంధిత శాఖల అధికారులు నిరంతర పర్యవేక్షణ జరిపి, ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పవన్ ఆదేశించారు. మల్టీప్లెక్సులు, సింగిల్ స్క్రీన్లలో ఆహార పదార్థాల వ్యాపారంలో గుత్తాధిపత్యం నడుస్తోందన్న విషయం ప్రభుత్వ దృష్టికి వచ్చిందని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని మంత్రి దుర్గేశ్ కు సూచించారు. తినుబండారాల ధరలు అందుబాటులో ఉంటేనే ప్రేక్షకులు కుటుంబాలతో సినిమాకు వస్తారని, తద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపంలో ఆదాయం కూడా పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై పన్నుల శాఖతో సమీక్షించాలని తెలిపారు.
సినిమా హాళ్ల బంద్ ప్రకటన వెనుక ఉన్న కారణాలు, కొందరు వ్యక్తుల ప్రమేయం, ఇద్దరు నిర్మాతలు తమకు సంబంధం లేదని ప్రకటించడం, తూర్పు గోదావరి జిల్లా నుంచే బంద్ ప్రకటన రావడం వంటి అంశాలపై చర్చించారు. బంద్ వెనుక ఒక నిర్మాత, థియేటర్లు కలిగిన రాజకీయ నాయకుడి ప్రమేయం ఉందని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఆ కోణంలో కూడా దర్యాప్తు చేయాలని పవన్ సూచించారు.
"ఈ బంద్ ప్రకటన వెనుక ఎవరున్నా, వారు జనసేన పార్టీకి చెందినవారైనా సరే, కఠిన చర్యలు తీసుకోవాలి. బెదిరింపులతో వ్యాపారాలు చేసే అనారోగ్యకర వాతావరణాన్ని సహించవద్దు" అని స్పష్టం చేశారు. సినిమా వ్యాపారం సజావుగా సాగేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ఫిల్మ్ ఛాంబర్, నిర్మాతల మండలి, ఇతర సినీ సంఘాలకు తెలియజేయాలని ఆదేశించారు. అలాగే, ప్రభుత్వం తీసుకురానున్న సమగ్ర సినిమా అభివృద్ధి పాలసీ కోసం సినీ పరిశ్రమలోని అన్ని వర్గాల నుంచి సూచనలు స్వీకరించాలని చెప్పారు. న్ కల్యాణ్ పలు కీలక సూచనలు చేశారు.
సినిమా హాళ్లలో టికెట్ ధర కంటే పాప్‌కార్న్, ఇతర తినుబండారాలు, శీతల పానీయాలు, చివరికి మంచినీళ్ల సీసాల ధరలు కూడా అధికంగా ఉండటంపై సమావేశంలో చర్చించారు. వీటి వాస్తవ ధరలు, ప్రస్తుత విక్రయ ధరలు, నాణ్యతా ప్రమాణాలను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, ధరల నియంత్రణ చేపట్టాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మల్టీప్లెక్సులు, సింగిల్ స్క్రీన్‌లలో ఆహార పదార్థాలు, శీతల పానీయాల వ్యాపారంలో గుత్తాధిపత్యం కొనసాగుతోందన్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రికి ఆయన సూచించారు.
కుటుంబ సమేతంగా సినిమాకు వచ్చే ప్రేక్షకులు తినుబండారాలు, పానీయాల ధరలు చూసి వెనుకంజ వేసే పరిస్థితి ఉండకూడదని పవన్ అభిప్రాయపడ్డారు. ధరలు అందుబాటులో ఉంటే ప్రేక్షకుల సంఖ్య పెరిగి, పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం కూడా మెరుగుపడుతుందని ఆయన అన్నారు. ఈ అంశంపై పన్నుల శాఖతో కూడా పరిశీలన చేయించాలని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి చేసిన ఈ సూచనల నేపథ్యంలోనే అధికారులు తక్షణమే రంగంలోకి దిగి థియేటర్లలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగే అవకాశం ఉందని తెలుస్తోంది.

## చైనా, పాక్‌లకు చెక్: భారత్ సొంత స్టెల్త్ ఫైటర్ జెట్ తయారీకి గ్రీన్ సిగ్నల్!

వైమానిక దళం బలోపేతమే లక్ష్యంగా కీలక నిర్ణయం భారత రక్షణ రంగం మరో కీలక ముందడుగు వేసింది. దేశీయంగానే అత్యాధునిక ఐదో తరం స్టెల్త్ ఫైటర్ జెట్లను తయారు చేసుకునే ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆమోదముద్ర వేశారు. చైనా తన వైమానిక శక్తిని వేగంగా విస్తరించుకోవడమే కాకుండా, పాకిస్థాన్‌కు కూడా అత్యాధునిక యుద్ధ విమానాలను అందించేందుకు ప్రయత్నిస్తున్న నేపథ్యంలో భారత్ ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.ఈ సరికొత్త యుద్ధ విమానం రెండు ఇంజన్లతో, ఐదో తరం (ఫిఫ్త్ జనరేషన్) సైనిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకోనుంది. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఏడీఏ) పర్యవేక్షించనుంది. భారత రక్షణ మంత్రిత్వ శాఖ వెలువరించిన ప్రకటన ప్రకారం, ఈ స్టెల్త్ ఫైటర్ ప్రోగ్రామ్‌ను పూర్తిగా దేశీయ సంస్థలే ముందుకు తీసుకెళతాయి. ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా స్వతంత్రంగా లేదా జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టులో పాల్గొనేందుకు బిడ్లు దాఖలు చేయవచ్చని రక్షణ శాఖ స్పష్టం చేసింది.
ఈ ప్రాజెక్టులో భాగంగా, స్టెల్త్ విమానం నమూనా (ప్రోటోటైప్)ను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ, ప్రైవేటు రంగ రక్షణ సంస్థల నుంచి ప్రాథమిక ఆసక్తి వ్యక్తీకరణలను (ఈఓఐ) ఏడీఏ త్వరలో ఆహ్వానించనుంది. రక్షణ రంగంలో ప్రైవేటు తయారీని ప్రోత్సహించడంతో పాటు, దేశంలో యుద్ధ విమానాల తయారీలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)పై ఒత్తిడి తగ్గించేందుకే ఈ ఏడాది మార్చిలో ఒక ఉన్నత స్థాయి రక్షణ కమిటీ ప్రైవేటు సంస్థల భాగస్వామ్యానికి సిఫార్సు చేసింది.ప్రస్తుతం భారత వైమానిక దళంలో ఎక్కువగా రష్యా, ఫ్రెంచ్ యుద్ధ విమానాలే ఉన్నాయి. భారత వైమానిక దళంలో ఆమోదించిన 42 స్క్వాడ్రన్లకు గాను ప్రస్తుతం 31 స్క్వాడ్రన్లు మాత్రమే ఉండటంతో, ఈ కొరతను అధిగమించేందుకు కూడా స్టెల్త్ ఫైటర్ ప్రాజెక్టు ఊతమిస్తుందని భావిస్తున్నారు.
చైనా తన వైమానిక దళాన్ని వేగంగా విస్తరించుకోవడమే కాకుండా, పాకిస్థాన్ వైమానిక దళ విస్తరణకు కూడా సహాయం చేస్తుండటంతో, భారత్ తన స్వదేశీ స్టెల్త్ విమాన ప్రాజెక్టును వేగవంతం చేయాలని నిర్ణయించింది. భారత్ ప్రస్తుతం ఐదో తరం సైనిక విమానాల అభివృద్ధిపై దృష్టి సారించగా, చైనా ఇప్పటికే తన ఆరో తరం యుద్ధ విమానం (చెంగ్డూ ఎయిర్‌క్రాఫ్ట్ కార్పొరేషన్ అభివృద్ధి చేసిన జే-36గా భావిస్తున్నారు) నమూనాను ప్రదర్శించి, పరీక్షలు కూడా నిర్వహించింది.

# హైకోర్టుకు ముగ్గురు జడ్జీలు

హైదరాబాద్,మే27(జర్నలిస్ట్ వార్త):
దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల హైకోర్టు న్యా యమూర్తుల బదిలీకి సుప్రీంకోర్టు కొలీజియం సిఫా ర్సు చేసింది. 11 హైకోర్టులకు చెందిన 21జడ్జీల బ దిలీకి సోమవారం ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గ వాయ్ నేతృత్వంలో సమావేశమైన సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. వీరిలో కొందరు గతంలో పని చేసిన హైకోర్టులకే తిరిగి బదిలీఅవుతుండడం గమనార్హం. తెలంగాణ హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తులు బదిలీ కానున్నారు. కర్నాటక హైకోర్టు లో న్యాయమూర్తులుగా పని చేస్తున్న జస్టిస్ సి సుమలత, జస్టిస్ లలిత కన్నెగంటిలను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని,. అలాగే ప్రస్తుతం పాట్నా హైకోర్టు న్యాయమూర్తిగా పని చేస్తున్న అన్నిరెడ్డి అ భిషేక్ రెడ్డిని కూడా తెలంగాణ హైకోర్టుకు బదిలీ చే యాలని కొలీజియం సిఫార్సు చేసింది.
కాగా తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకో ర్టు సిఫార్సు చేసింది. అలాగే గతంలో ఏపి హైకోర్టు లో పని చేసి మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా బ దిలీ




అయిన బట్టు దేవానంద్‌ను తిరిగి ఎపి హైకోర్టు కు బదిలీ చేయాలని సిఫార్సు చేసింది. వీరేకాకుండా కర్ణాటక హైకోర్టుకు చెందిన జస్టిస్ వి కామేశ్వర రా వును ఢిల్లీ హైకోర్టుకు , గౌహతి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జమీర్‌ను కలకత్తా హైకోర్టుకు, గౌహ తి హైకోర్టుకు చెందిన మరో జడ్జి జస్టిస్ మనాష్ రం జన్ పాఠక్‌ను ఒడిశా హైకోర్టుకు , బాంబే హైకోర్టుకు చెందిన జస్టిస్ జస్టిస్ వాసుదేవ్ సాంప్రేను ఢిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలని ప్రతిపాదించింది. అలా గే అలహాబాద్ హైకోర్టుకు చెందిన జస్టిస్ వివేక్ చౌదరిని ఢిల్లీ హైకోర్టుకు, మరో న్యాయమూర్తి జస్టిస్ అ శ్వనీకుమార్ మిశ్రాను పంజాబ్ హర్యానా హైకోర్టుకు ,
గౌహతి హైకోర్టు జడ్జి జస్టిస్ సుమన్ ను బాంబే హైకోర్టుకు బదిలీ చేయాలని పేర్కొంది. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దినేశ్ కుమార్ సింగ్ కర్ణాటక హైకోర్టుకు, మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ వివేక్ కుమార్ సింగ్ మధ్యప్రదేశ్ హైకోర్టుకు ,అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి ఓంప్రకాశ్ శు క్లా ఢిల్లీ హైకోర్టుకు , రాజస్థాన్ హైకోర్టు న్యాయమూ ర్తి జస్టిస్ చంద్రశేఖర్ బాంబే హైకోర్టుకు, పంజాబ్ హర్యానా హైకోర్టు జడ్జి సుధీర్ సింగ్ పాట్నా హైకోర్టుకు, రాజస్థాన్ హైకోర్టుకు చెందిన జస్టిస్ అరుణ్‌కుమార్‌ను ఢిల్లీ హైకోర్టుకు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జయంత్ బెనర్జీ కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులకు కేంద్రం ఒకటి రెండు రోజుల్లో ఆమోదం తెలపవచ్చని భావిస్తున్నారు.

# శిక్షణలో సర్వే అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి

**-హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**హన్మకొండ/మే27(జర్నలిస్ట్ వార్త):**
లైసెన్స్ సర్వేయర్ శిక్షణా కార్యక్రమంలో సర్వేకు సంబంధించిన అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రం (టిటిడిసి)లో జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. శిక్షణ కార్యక్రమంలో సర్వే నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై నిర్వహిస్తున్న బోధనా తరగతులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. బోధనా అంశాలను కలెక్టర్ విన్నారు. శిక్షణార్థులతో కలెక్టర్ సంభాషించారు. శిక్షణ కార్యక్రమం గురించి శిక్షణార్థులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. శిక్షణకు సంబంధించిన మెటీరియల్లు కలెక్టర్ చేతుల మీదుగా అభ్యర్థులకు



పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ లైసెన్స్ సర్వేయర్లకు 50 రోజులపాటు నిర్వహించే శిక్షణ కాలంలో సర్వేకు సంబంధించిన అన్ని అంశాలపై పట్టు సాధించే విధంగా శిక్షణా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. సర్వేకు సంబంధించిన అంశాలపై శిక్షణార్థులకు 50 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం అనంతరం అభ్యర్థులకు పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎలాంటి భూవివాదాలు పరిష్కరించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది అన్నారు. భూ వివాదాలు లేకుండా ఉండాలంటే ఫీల్డ్ సర్వే చేయడం ద్వారా సాధ్యమవుతుందన్నారు. శిక్షణ అనంతరం పరీక్షను నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి భూభారతి సర్వే చేసేందుకు అవకాశం లభిస్తుందన్నారు. భూ వివాదాల పరిష్కారానికి సర్వే రిపోర్ట్ ఎంతో ప్రాముఖ్యత ఉంటుందన్నారు. శిక్షణార్థుల హాజరు అన్ని రోజులపాటు అటెండెన్స్ పక్కాగా తీసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం క్షేత్రస్థాయిలో బాగా పనిచేయాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే వాటిని గురించి నివృత్తి చేసుకోవాలన్నారు. సర్వే సంబంధించిన అన్ని విషయాలను తెలుసుకునే విధంగా తరగతులను మిస్ చేసుకోవద్దని అన్నారు. శిక్షణ తరగతులను సరిగ్గా వింటేనే ప్రాక్టికల్ గా చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ల్యాండ్ సర్వే రికార్డ్స్ ఏడి శ్రీనివాసులు, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# తాత్కాలిక అధ్యాపకుల, ఉపాధ్యాయుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

**- భద్రాద్రి జోన్, జోనల్ అధికారి కె. స్వరూపరాణి**

**హనుమకొండ/మే 27(జర్నలిస్ట్ వార్త):** భద్రాద్రి జోన్ వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాలలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో తాత్కాలిక అధ్యాపకుల, ఉపాధ్యాయుల భర్తీకి మంగళవారం భద్రాద్రి జోన్, జోనల్ అధికారి కె. స్వరూపరాణి ఓ ప్రకటనలో తెలిపారు. ఓ ప్రకటన విడుదల చేశారు. భద్రాద్రి జోన్ లో గల వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లోని 19 తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలలో (బాలురు మరియు బాలికలు) ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు తాత్కాలిక పద్ధతిన ఉపాధ్యాయులు, లైబ్రేరియన్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, హెల్త్ సూపర్వైజర్లు ఎంపిక కొరకై అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు సేకరిస్తున్నారు. ఈ నెల 29 లోపు దరఖాస్తులను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (గర్ల్స్ ధర్మసాగర్, హంటర్ రోడ్డు హనుమకొండ జిల్లాలో సమర్పించగలరని తెలిపారు.

**విద్యార్హతలు:**
జూనియర్ లెక్చరర్, పిజిటి పోస్టులకు యుజిసి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పి.జి. డిగ్రీ తో పాటు బి.ఇడి అర్హత, టిజిటి పోస్టుకు యుజిసి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుండి బీఎస్సీ/బిఏ/బీ.కం డిగ్రీ కనీసం 50 శాతం మార్కులతో పాటు, బి.ఇడి అర్హత కలిగి ఉండాలన్నారు. రెసిడెన్షియల్ విద్యా బోధన పట్ల అవగాహన, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29 లోపు దరఖాస్తులను సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (గర్ల్స్) ధర్మసాగర్, హంటర్ రోడ్డు, హనుమకొండ జిల్లా లో, తమ తమ పూర్తి బయోడేటా తో పాటు, ధృవ పత్రాల జిరాక్స్ కాపీల సెట్టును జత పరచి దరఖాస్తులను సమర్పించగలరని కోరారు. పాఠ్యాంశ బోధన డెమోలు 31-5-2025 న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాయ్స్) వర్ధన్నపేట, మడికొండ, హనుమకొండ జిల్లా నందు నిర్వహించబడతాయన్నారు. డెమో కొరకు అటెండ్ అయ్యే అభ్యర్థులు తమ విద్యార్హతలను తెలిపే ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకొని సకాలంలో ఉదయం 9 గంటలకల్లా హాజరు కావలసి ఉంటుందన్నారు.

**ముఖ్య గమనిక:**
బాలికల విద్యాలయాలలో పనిచేయడానికి స్త్రీ అభ్యర్థులు మాత్రమే అర్హులు

# 77 మంది ఎంజీఎం ఉద్యోగులకు మెమోలు

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తనిఖీ కారణం
- ప్రజా ప్రతినిధులు తనిఖీ చేస్తేనే చర్యలుంటాయా?
- ఉద్యోగం సక్రమంగా నిర్వర్తించాల్సిన బాధ్యత లేదా?
- ఎమ్మెల్యేలు నిరంతరం తనిఖీ చేస్తూనే ఉంటారా?
- హాస్పిటల్ సూపరింటెండెంట్ ఏం చేస్తున్నారు?

**వరంగల్/మే 27(జర్నలిస్ట్ వార్త):**
వరంగల్ జిల్లాలో వైద్య సేవలకు పెట్టింది పేరుగా ఎంజీఎం ఆసుపత్రి ఉత్తర భారత దేశంలోనే పేరుగాంచింది. సాక్షాత్తు ప్రజా పాలకులు ఉత్తర భారతదేశానికి ఎంజీఎం ఆసుపత్రి తల్లి లాంటిదిగా పేర్కొన్న సంఘటన తెలిసిందే. మంగళవారం ఎంజీఎం ఆసుపత్రిలోని నిర్లక్ష్యపు ఉద్యోగుల పనితీరుపై చర్యలు తీసుకున్నారు. 77 మంది ఉద్యోగులకు మెమోలు అందజేసిన ఘటన వరంగల్ హనుమకొండ జిల్లాల్లో హాక్ టాపిక్ గా మారింది. ఒకేసారి అంతమందిపై చర్యలు తీసుకున్న ఏంటని హవాక్కు అవ్వాల్సిన అవసరం లేదు. ఇటీవల వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అధికారులతో కలిసి ఎంజీఎ ఆసుపత్రిని సందర్శించిన క్రమంలో విధులకు హాజరుకాని ఉద్యోగుల పట్ల ఆరా తీశారు. 77 మంది గైర్హాజర్ కావడంతో ఒక్కసారిగా వారు హావాక్కు అయ్యారు. బాధ్యతాయుతంగా, నిస్వార్థంగా ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన వారు బాధ్యతల్లో లేకపోవడం కారణంగా ఏంటి పరిస్థితి అని సంబంధిత ఉన్నతాధికారులను వారు ప్రశ్నించారు. ఇట్టి విషయమై నిర్లక్ష్యపు విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులపై తక్షణ చర్యల్లో భాగంగా మెమోలు జారీ చేశారు. ఈ ఘటనకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆకస్మిక తనిఖీ కారణమని ప్రస్తుతం వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

## ప్రజా ప్రతినిధులు ఆదేశిస్తేనే చర్యలా?

వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి సందర్శించి, ప్రజా ప్రతినిధులు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే ఉన్నత అధికారులను ఆదేశిస్తేనే చర్యలు తీసుకుంటారా? నిర్లక్ష్యపు నీడలో ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదన్న సంగతి ఉన్నతాధికారులు ఎందుకు గమనించలేకపోతున్నారు. వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారన్న విషయం చర్చగా మారింది. నిర్లక్ష్యపు బాధ్యతల్లో ఎంతమంది ఉద్యోగులు వ్యవహరిస్తున్నారో? ఎంతమంది ఉద్యోగులు హాజరు అవుతున్నారో? సంబంధిత ఉన్నతాధికారి హాస్పిటల్ సూపరింటెండెంట్ చూసుకోవలసిన బాధ్యత వారిపై లేదా? అంటున్నారు. అనుకోకుండా ఆకస్మిక తనిఖీ చేపట్టడం వల్ల ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి ఆసుపత్రిలోని నిర్లక్ష్యం ఉద్యోగుల విధివిధానాలను గుర్తించారు. ఇలాంటి పరిస్థితుల పట్ల చర్యలు చేపట్టాలని అనేకమార్లు సోషల్ మీడియా ద్వారా ప్రచారం జరిగిన సంఘటనలు ఉన్నాయి. అప్పుడు చర్యలు ఎందుకు తీసుకోలేదు? ఇలా ఎన్నిసార్లు? ఎంతమంది? ఎమ్మెల్యేలు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్న ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి.




## ప్రైవేట్ హాస్పిటల్స్ కి బాధితులను పంపించడమేంటి?

ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రులలో అడ్వాన్స్(హెవి) టెక్నాలజీ కలిగిన మెటీరియల్ లేకపోవడం ఓ కారణమైతే. ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు హాస్పిటల్స్ ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. ప్రతి ప్రైవేట్ హాస్పిటల్ లో దాదాపు 20 నుంచి 30 మంది బాధితులు ఓపి ద్వారా హాజరవుతున్నారని తెలుస్తోంది. అందులోనూ ప్రభుత్వ హాస్పిటల్ నుండి మరికొంతమంది ప్రైవేటు హాస్పిటల్ ఆశ్రయిస్తున్నారు. అందుకు కారణం ఎంజీఎం హాస్పిటల్లో కొంతమంది ప్రైవేటు హాస్పిటల్స్ బినామీలుగా ఏర్పడి వారి కోసమే ఉద్యోగం చేస్తున్నట్లు పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజలకు సేవలు అందించాల్సిన ఎంజీఎం ఉద్యోగులు హాస్పిటల్ హాజరు కాకపోవడం, వైద్య సేవల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ప్రైవేట్ హాస్పిటల్ వెళ్ళమని బాధితులను పురమాయించడం బాధ్యతగా తీసుకొని కమిషన్లకు కక్కుర్తి పడి పంపిస్తూ పాపం మూటగట్టుకుంటున్నారని ఎంజీఎం సమీప ప్రాంతంలో ప్రచారం జరుగుతోంది. ఇప్పటి కైనా హాస్పిటల్లో ఏం జరుగుతుందన్న సందర్భం పై ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహించి నిర్లక్ష్యం చేస్తున్న ఉద్యోగులపై చర్యలు తీసుకుంటే తప్ప సమస్యలు చక్కబడతాయి అన్న నమ్మకం ప్రజలకు లేకపోయింది. ప్రజా ప్రతినిధులు మాత్రమే కాదు, వేతనాలు పొందుతూ ఉద్యోగం చేస్తున్న ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ప్రజలకు సేవలు అందించే విధంగా ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉండాలి

**-హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**హనుమకొండ/మే27(జర్నలిస్ట్ వార్త):**
ఖరీఫ్ సీజన్ లో రైతులు సాగు చేసేందుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సరిపోను విత్తన, ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో అందుబాటులో ఉంచాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు.



మంగళవారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కేంద్రంలోని లక్ష్మి ఫర్టిలైజర్స్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన, ఎరువులు, పురుగు మందుల నిల్వలు, విక్రయాలకు సంబంధించిన రికార్డులు, బిల్లు బుక్కులను కలెక్టర్ తనిఖీ చేశారు. గోదాములో నిల్వ చేసి ఉన్న విత్తనాలు, ఎరువులు, మందులను కలెక్టర్ పరిశీలించారు. ఈ-పాస్ మిషన్ వినియోగం గురించి విత్తన, ఎరువుల దుకాణదారులను అడిగి తెలుసుకున్నారు. దుకాణాలలో విత్తన, ఎరువులు, పురుగు మందుల నిల్వలకు సంబంధించిన స్టాక్ బోర్డులను పరిశీలించారు. పత్తి విత్తన ప్యాకెట్లకు ఉన్న లేబుల్స్ ను పరిశీలించారు. అదేవిధంగా పత్తి విత్తనాలకు సంబంధించి ఎన్ని రకాలు నిల్వ ఉన్నాయి, ఏ రకం ఎక్కువగా విక్రయిస్తున్నారనే వివరాలను దుకాణదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటల సాగులో సస్యరక్షణ చర్యలకు డ్రోన్ల ద్వారా నానో యూరియాను చల్లే విధంగా రైతులను ప్రోత్సహించాలని దుకాణదారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, మండల వ్యవసాయ అధికారి అనురాధ, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు

**-కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ /మే27(జర్నలిస్ట్ వార్త):** విత్తనాలను అధిక ధరలకు అమ్మితే ఫర్టిలైజర్ షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హెచ్చరించారు. మంగళవారం నర్సంపేట పట్టణంలోని పరమేశ్వర వితన విక్రయ దుకాణం, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలను కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్, రసీదు పుస్తకాలు, ధరల పట్టిక, తూకం యంత్రం, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. గీసుగొండలో మండల కేంద్రంలోని రాశి సీడ్స్ కంపెనీ గోడౌన్ ను తనిఖీ చేసి గోడౌన్ స్టోరేజ్ పాయింట్ నుండి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాలకు పంపిణీ ప్రక్రియ ను స్టాక్, రసీదులు,బిల్లులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు అమ్మాలని, సంబంధిత కంపెనీ పేరుతో రసీదు తప్పనిసరిగా రైతులకు అందించాలని ఆదేశించారు. కల్తీ, నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. జిల్లావ్యాప్తంగా నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీసు, వ్యవసాయ అధికారులతో టాస్క్ ఫోర్స్ టీంలను నియమించి నిత్యం విత్తనాల దుకాణాలపై నిఘా పెట్టి తరచుగా తనిఖీలు నిర్వహిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి ఎక్కువ ధరలకు అమ్మితే షాపు లైసెన్స్ రద్దుచేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దుకాణంలో నిల్వల వివరాలను ప్రతిరోజు వ్యవసాయ శాఖ అధికారులకు అందించాలనిసూచించారు.కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, ఏడీఏ దామోదర్, వ్యవసాయ అధికారి కృష్ణ తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర అవతరణ వేడుకలను విజయవంతంగా నిర్వహిద్దాం




**హనుమకొండ/మే 27(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను జిల్లాలో విజయవంతంగా నిర్వహిద్దామని జిల్లా ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ వై.వి. గణేష్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోనే కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ వై వి గణేష్ మాట్లాడుతూ జూన్ రెండో తేదీన నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అధికారులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. వేడుకల ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ మేన శ్రీను, జడ్పీ సీఈవో విద్యాలత, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె.నారాయణ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులు అందజేసిన డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మి



**నర్సంపేట/మే27(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నర్సంపేట డిపో యందు డిపో మేనేజర్ ప్రసూన లక్ష్మీ ఆధ్వర్యంలో ఏప్రిల్ నెల ప్రగతి చక్రంఅవార్డుల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. నర్సంపేట డిపో లో పనిచేస్తున్న ఉద్యోగులు కండక్టర్లు సంతోష్,స్రవంతి, రమేష్, సుమీల డ్రైవర్ అశోక్ రెడ్డి, మెకానిక్ రవి, రమేష్ లకు డ్యూటీలో ఉత్తమ ప్రతిభ కనబర్చి డిపో ఆధాయానికి కృషి చేసినందుకు ప్రగతి చక్రం అవార్డు ప్రశంసా పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ , ఎంఫ్ ప్రభాకర్ సూపర్వైజర్లు మరియుడిపో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కగార్ ఆపరేషన్ పై న్యాయ విచారణ జరుపాలి

## -ఎన్ కౌంటర్ లను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలి -బూటకపు ఎన్ కౌంటర్ వల్లే శవాలను ఇచ్చేందుకూ భయం

## -సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు





**హసన్ పర్తి/మే27(జర్నలిస్ట్ వార్త):** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కగార్ ఆపరేషన్ పై న్యాయ విచారణ జరుపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లా సిపిఐ మహాసభల రెండవ రోజు హసన్ పర్తి మండల కేంద్రంలో జరిగిన ప్రతినిధుల సభను ఉద్దేశించి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. కేంద్రం చేసిన బూటకపు ఎన్ కౌంటర్ లపై సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకోవాలని కోరారు. చత్తీస్ ఘడ్ లో జరిగింది బూటకపు ఎన్ కౌంటర్ అయినందు వల్లనే నక్సల్ శవాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు భయపడుతున్నారని విమర్శించారు. ఈ దేశ పౌరులను చంపిన టెర్రరిస్టులను పట్టుకోవడంలో బిజెపి ప్రభుత్వం విఫలం అయిందని, అందుకే దేశ పౌరులైన మావోయిస్టులను చంపి ప్రధాని నరేంద్ర మోడీ సంబురాలు చేసుకుంటున్నారని అన్నారు. దేశ పౌరులను చంపిన టెర్రరిస్టులతో చర్చలకు సిద్దపడిన కేంద్రం ప్రజల కోసం పోరాడుతున్న మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరిపేందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు. టెర్రరిస్టులకంటే మోడీకి కమ్యూనిస్టులంటేనే భయమని, అందుకు ఎన్ కౌంటర్ ల తరువాత శవాలను ఇచ్చేందుకూ భయపడుతున్నాడని అన్నారు. ఇటీవల కాలంలోనే వందలమంది మావోయిస్టులను చంపివేశారని, కమ్యూనిస్టులను తుడిచి పారేస్తామని మోడీ, అమిత్ షా ప్రగల్భాలు పలుకుతున్నారని, అలాంటి వారందరికి హిట్లర్, ముస్సోలినీ గతే పడుతుందని హెచ్చరించారు. దేశంలో అన్ని ఎర్రజెండా పార్టీలు ఏకం కావాలని, అందరూ ఏకమైతే ఎదుర్కొనే శక్తి బూర్జువా పార్టీలకు ఉండదని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ తో జత కట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తున్నదని, అది కేసిఆర్ కు కవిత రాసిన లేఖతో స్పష్టం అయిందని అన్నారు. దేశంలో అంబానీ, ఆదానీలకు ఊడిగం చేసే మోడీతో జతకట్టేందుకు సిద్దపడుతావా కేసిఆర్ అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని, కమ్యూనిస్టులను బతికించుకోవాల్సిన అవసరం ప్రజలకు ఉందని అన్నారు. ఎన్నో పార్టీ లు పుట్టి కనుమరుగు అయ్యాయని, ప్రజాప్రయోజనాలకే నిలబడి ఉండడం వల్లనే అధికారం లేకున్నా కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల పాటు నిలబడిందని అన్నారు. సిపిఐ ఆవిర్భవించి ఈ ఏడాది డిసెంబర్ 25 నాటికి వందేళ్లు కావస్తుందని, వందేళ్ల ముగింపు బహిరంగ సభను ఖమ్మంలో ఐదు లక్షల మందితో నిర్వహించనున్నట్లు తెలిపారు.

### అంబేద్కర్ వాదులు, కమ్యూనిస్టులు ఏకం కావాలి

#### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

రెండవ రోజు సిపిఐ మహాసభల సందర్భంగా జరిగిన ప్రతినిధుల సభను ప్రారంభించిన అనంతరం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మూడవ సారి అధికారంలోకి వచ్చిన తరువాత అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని మార్చివేసి మను వాదాన్ని తీసుకువచ్చేందకు ప్రయత్నిస్తున్నదన్నారు. అలాగే ఆపరేషన్ కగార్ పేరుతో, వక్ఫ్ బిల్లు పేరుతో దాడి తీవ్రం చేస్తూ ముస్లింలు, క్రిష్టియన్ లను, కమ్యూనిస్టులను శత్రువులుగా చూస్తున్నారన్నారు. అందుకే దేశంలో అంబేద్కర్ వాదులు, కమ్యూనిస్టులు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో తలసరి ఆదాయం పెరిగిందని, ప్రపంచంలో మన దేశం నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, తప్పుడు లెక్కలు చెబుతున్నారని, దొంగ లెక్కలు, మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. దేశంలో పేదల సంపద రెట్టింపు కాలేదని, కేవలం అంబానీ, ఆదానీ లాంటి కార్పొరేట్ శక్తుల ఆదాయమే పెరిగిందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో మన పాత్ర ఉందని, అసెంబ్లీలో సిపిఐకి ఒక్క ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ప్రజల సమస్యలపై గళమెత్తడంలో ముందున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేదంటే సిపిఐ ఆద్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. హైదరాబాద్ తరువాత అతిపెద్ద నగరంగా ఉన్న వరంగల్ ను రాష్ట్ర రెండో రాజధానిగా ఏర్పాటు చేసేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని, హైదరాబాద్ మాదిరిగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పేదల ఇండ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ రావాలని, సాఫ్ట్ వేర్ కంపెనీలు రావాలని, స్థానికులకు ఉద్యోగాలు రావాలన్నారు. వీటి సాధన కోసం, ప్రజాసమస్యల పరిష్కారం కోసం గ్రామ గ్రామాన సిపిఐని బలోపేతం చేసి ఉద్యమాలు నిర్మించాలని కోరారు. మహాసభల ఆహ్వాన సంఘం అద్యక్షుడు నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ హసన్ పర్తి మండలంలో అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐకి ఉందన్నారు. మండలంలో ఎందరో కమ్యూనిస్టు వీరులు ప్రజల కోసం పోరాడి అమరులయ్యారని చెప్పారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ఇప్పటి వరకు పార్టీ నిర్వహించిన కార్యకలాపాల నివేదికను ప్రవేశ



పెట్టగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి ప్రతినిధుల సభను ఉద్దేశించి ప్రసంగించారు. తొలుత సిపిఐ జిల్లా మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిపిఐ పతాకాన్ని సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి ఎగురవేశారు. ఈ మహాసభకు అద్యక్షవర్గంగా మంచాల రమాదేవి, బత్తిని సదానందం, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, ఉట్కూరి ప్రణీత్ గౌడ్, వేల్పుల సారంగపాణి, మాలోతు శంకర్ వ్యవహరించగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా మాజీ కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాష్ మియా,పనాస ప్రసాద్, తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, ఎన్. అశోక్ స్టాలిన్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్ తదితరులు పాల్గొన్నారు.

## మదన్ లాల్ మృతి పార్టీకి, బడుగు బలహీన వర్గాలకు తీరని లోటు

### - మాజీ ఎంపీ నామ, మాజీ ఎమ్మెల్యే సండ్ర

**వైరా/మే27(జర్నలిస్ట్ వార్త):** వైరా మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాణోత్ మదన్‌లాల్ మృతి తనకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర తెలిపారు. మంగళవారం నాడు ఖమ్మం నగరం లోని కవిరాజ్ నగర్ నందు ఉన్న మదన్ లాల్ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి మాజీ ఎంపీ నామ నాగేశ్వరావు గారితో కలసి పూల మాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుండి ప్రజా సమస్యల పై పోరాటం చేసిన నాయకుడు మదన్ లాల్ అన్నారు. గెలిచిన, ఓడిన ప్రజల పక్షాన నిలబడ్డారని పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఆయన పనితీరు అందరికీ ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. మదన్‌లాల్ తో ఉన్న అనుబంధాన్ని గుర్తుంచేసుకుంటూ ఆయన నియోజకవర్గ ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని, ఆయన మృతి పార్టీకి, బడుగు బలహీన వర్గాలకు తీరని లోటని సండ్ర పేర్కొన్నారు. ఎమ్మెల్యే గా వైరా నియోజకవర్గంలో మదన్‌లాల్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. ఆయన ఎప్పుడు






ప్రజల మధ్య ఉండే నాయకుడిగా పేరుగాంచారని, ఎల్లప్పుడూ ప్రజలకు, పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉండేవారని తెలిపారు. నియోజకవర్గంలో సామాజిక న్యాయం కోసం ఎంతో పోరాడిన మదన్‌లాల్, గిరిజనుల సమస్యలపై ప్రత్యేకంగా శ్రద్ధ వహించారని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. చివరి దాకా పార్టీ పట్ల నిబద్ధతతో ఉన్నారని సండ్ర తెలిపారు. మదన్ లాల్ మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు, అనుచరులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని సండ్ర అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తాళ్లూరి జీవన్ కుమార్, వైరా బిఆర్ఎస్ రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, దిశా కమిటీ మాజీ సభ్యులు, మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జునరావు, మాజీ ఎంపీపీ సామినేని హరి ప్రసాద్, వైరా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, మోరంపూడి ప్రసాదరావు, గొడ్డేటి మాధవరావు, బత్తుల శ్రీను, వాకదాని కోటేశ్వరరావు, ఏదునూరి శ్రీను, పాల్వంచ రాజేష్, సరిపూడి గోపి సందేశ్, రేగళ్ల కృష్ణ ప్రసాద్, రాంబాబు, నరేష్ తదితరులు ఉన్నారు.

## సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలి

### -అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కే. రాజేంద్రప్రసాద్



**పర్వతగిరి/మే27(జర్నలిస్ట్ వార్త):** వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచాలని వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కే. రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని వడ్లకొండ గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాసంగిలో వరికి బదులుగా నూనెగింజలు, పప్పు ధాన్యాలు, కూరగాయల సాగును పెంచుకోవాలన్నారు. పొలంగట్లపై చెట్లను నాటి పర్యావరణాన్ని పెంచుకోవాలన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్. అనూష మాట్లాడుతూ పురుగుమందులను అవసరం మేరకు వాడుకోవాలన్నారు. విత్తనాలు, పురుగుల మందులను కొనుగోలు చేసిన సమయంలో తప్పనిసరిగా రసీదులు తీసుకోవాలన్నారు. ప్రతి సీజన్లో పంట మార్పిడి చేయాలని, తద్వారా నేల ఆరోగ్యం బాగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రశాంత్ కుమార్, ఏఈఓ శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

## జవహర్ లాల్ నెహ్రూ కి క్లబ్ ఆధ్వర్యంలో ఘన నివాళి







**తల్లాడ/మే27(జర్నలిస్ట్ వార్త):** భారత దేశ తొలి ప్రధాని భారతరత్న మరియు స్వతంత్ర పోరాటంలో ప్రముఖ నాయకులలో ఒకరుగా నిలిచిన జవహర్లాల్ నెహ్రూ గారి వర్ధంతి సందర్భంగా మంగళవారం తల్లాడ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు బెల్లంకొండ ఆంజనేయులు మాట్లాడుతూ మహాత్మా గాంధీ ప్రభావంతో భారత జాతీయ కాంగ్రెస్ కి చేరారని అనేక సందర్భాల్లో బ్రిటిష్ ప్రభుత్వం ద్వారా జైలు శిక్షకు గురయ్యారని 1947 లో భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మొదటి ప్రధానిగా నియమితులయ్యారని వారు కొనియాడారు. డిసి దారా శ్రీనివాసరావు మాట్లాడుతూ నెహ్రూ భారత రాజ్యాంగాన్ని అమలు చేయడంలో కీలకపాత్ర వహించారని ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేశారని ఆయనకు పిల్లలంటే ఎంతో ఇష్టపడే వారిని అందుకే నవంబర్ 14 నా ఆయన పుట్టిన రోజును బాలల దినోత్సవం గా జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కటికి వెంకటేశ్వర్లు ట్రెజరర్ శీలం వెంకట్ రెడ్డి డిసి లు కర్నాటి లక్ష్మారెడ్డి దగ్గుల రాజశేఖర్ రెడ్డి క్లబ్ సభ్యులు దగ్గుల నారాయణరెడ్డి నంబూరి కనకదుర్గ ప్రసాద్ కోడూరి నాగేశ్వరరావు తోట మురళి యాచ వరపు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహణ










**సత్తుపల్లి/మే27(జర్నలిస్ట్ వార్త):** భారత్ పై జరిగిన ఉగ్రదాడిని తిప్పికొడుతూ భారత సైన్యం విజయవంతంగా నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకొని, మంగళవారం సత్తుపల్లి జాతీయవాదుల సమక్షంలో గంగారంలో ఘనంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బెటాలియన్ గ్రౌండ్ నుంచి గంగారం మెయిన్ రోడ్ వరకు తిరంగా యాత్ర నిర్వహించబడింది. జాతీయ జెండాలు మోస్తూ, జై హింద్, వందే మాతరం మేము సైతం దేశం కోసం అంటూ నినాదాలతో ర్యాలీని మరింత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ యాత్రకు జాతీయవాది సాలి శివ నేతృత్వం వహించగా, జాతీయవాదులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బీజేపీ పార్టీ రాష్ట్ర నాయకులు ఇవీ రమేష్, మరియు జాతీయవాదులు మాట్లాడుతూ పాహెల్గం లో మనదేశ మహిళల ఎదుట భర్తలను మతం అడిగి ప్రాణాలు తీసిన పాకిస్తాన్ ఉగ్రవాదులు నీ అంతమొందించుట కొరకు మనదేశ ఆర్మీ వీరనారీమణుల నేతృత్వంలో ఆపరేషన్ సింధూర్ ద్వారా కేవలం 24నిమిషాల్లో నే వారి 9ఉగ్ర స్థావరాలను తుద ముట్టించడం జరిగిందని వందకు పైగా ఉగ్రవాదులను చంపడం జరిగిందని మరో పదిహేను నిమిషాలు మన సైన్యం కేటాయించినట్లయితే ప్రపంచ పటంలో పాకిస్తానీ ఉండేది కాదని అన్నారు మన సైన్యం సత్తా చూసి పాకిస్తాన్ కి వెన్నులో వణుకు పుట్టి యుద్ధం చేయలేక చేతులెత్తేసి ప్రపంచ దేశాల ముందు మోకరిల్లడంతో ప్రపంచ దేశాల విజ్ఞప్తి మేర మన సైన్యం దాడులు ఆపడం జరిగిందని దీని ద్వారా మనం సైన్యం సత్తా ఏంటో ప్రపంచ దేశాలకు కూడా తెలవడం జరిగిందన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు:ఈవీ రమేష్, వీరంరాజు, సుదర్శన్ మిశ్రా, జొన్నగడ్డల నరేష్, బానోతు విజయ్, చీకటి వసంతరావు, పాలకొల్లు శ్రీనివాస్, రాంబాబు, ప్రభాకర్ రెడ్డి, మట్టా ప్రసాద్, వందనపు భాస్కరరావు, వెంకటేశ్వరరావు, , మందా శివ, భీమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, దొడ్డపునేని కృష్ణయ్య, లక్ష్మీనారాయణ, సుభానీ,కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. దేశ భక్తి ప్రజల్లో కలిగించిన ఈ విజయోత్సవ ర్యాలీ, యువతలో జాతీయ చైతన్యాన్ని మరింత ప్రేరేపించినట్టు నిర్వాహకులు తెలిపారు.

# దళిత రత్న అవార్డు గ్రహీతకు సన్మానం

## - అభినందించిన కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షులు



**ములుగు/మే 27(జర్నలిస్ట్ వార్త):** అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా ప్రభుత్వం దళిత రత్న అవార్డులను ప్రకటించింది. ఇటీవల ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకులు గణపాక సుధాకర్ అవార్డును అందుకున్న సంగతి తెలిసిందే. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ సుధాకర్ ని అభినందిస్తూ, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి సుధాకర్ చేసిన సేవలకు గుర్తింపు దళిత రత్న అవార్డు అన్నారు. కష్టపడే తత్వం కలిగిన వారిని ప్రోత్సహించేలా ఇలా అవార్డులు ప్రభుత్వం అందజేయడం సంతోషకరమన్నారు. ఇలా వర్గ అభివృద్ధికి పునర్నిర్మాణంగా కృషి చేస్తూ సుధాకర్ భవిష్యత్తులో ముందుకు సాగాలని, మరింత గుర్తింపు లభించేలా అన్ని రంగాల్లో ఎదగాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ యాదవ్, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల ప్రభాకర్, యువజన నాయకులు ఘనపాక భరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం కార్పొరేషన్ అభివృద్ధి పనులను పరిశీలించిన మేయర్



**ఖమ్మం/మే27(జర్నలిస్ట్ వార్త):**



ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో గల 58వ డివిజన్ రాపర్తి నగర్ -2 వివేకానంద నగర్, దొరన్న కాలనీ. నందు జరుగుతున్న అభివృద్ధి పనులను ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు ఎక్కడ ఏ అవసరం ఉందో గమనించి అవసరానికి తగ్గ ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో పార్టీలకు అతీతంగా అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీ స్థానిక ప్రజలు అభినందింస్తున్నారని తెలిపారు. నగర ప్రజల అవసరాలు అనుగుణంగా డ్రైన్లు రోడ్ల సౌకర్యాన్ని కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో మట్టి రోడ్డు లేకుండా సీసీ రోడ్లు, సీసీ డ్రైవర్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శెట్టి రంగారావు, సోమిరెడ్డి ఉపేందర్ రెడ్డి, నాంపల్లి శంకరయ్య, బేబీ, పబ్లిక్ హెల్త్ డి ఈ నవీన్

# విద్యుదాఘాతంతో దూడ మృతి




పర్వతగిరి/మే27(జర్నలిస్ట్ వార్త): విద్యుదాఘాతంతో దూడ మృతి చెందిన సంఘటన మండలంలోని చౌటపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. బాధిత రైతు మట్టపల్లి చిన్న మాధవరావు తెలిపిన వివరాల ప్రకారం తన దూడను పశు వుల కొట్టంలో కట్టేసిన క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ పగిలి అక్కడికక్కడే మృతి చెందింది. దూడ విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని, ప్రభుత్వపరంగా తనను ఆదుకోవాలని రైతు విలపిస్తూ కోరాడు.

# కెసిఆర్ డైరెక్షన్‌లోనే కవిత కొత్త పార్టీ



మెదక్,మే27(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణలో ఎమ్మెల్సీ కవిత పాదయాత్ర చేస్తారని, అలాగే జూన్ 2న కొత్త పార్టీ ప్రకటన చేస్తారని మెదక్ ఎంపి రఘునందన్ రావు తెలిపారు. జూన్ 2న కవిత కొత్త పార్టీ రాబోతుందని, పార్టీ పెట్టి షర్మిల తరహాలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయనుందని అన్నారు. తుఫ్రాన్ లో రఘునందన్ రావు పర్యటించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బిఆర్ఎస్ లో జరుగుతున్న పరిణామాలపై జోస్యం చెప్పారు. మాజీ సిఎం కెసిఆరే కవితతో పార్టీ పెట్టిస్తున్నారని అన్నారు. తండ్రి, కుమార్తె మధ్య మధ్యవర్తులెందుకని ప్రశ్నించారు. కవిత గెలిచినప్పుడు కెసిఆర్ దేవుడయ్యారని, ఇప్పుడు దెయ్యం ఎలా అయ్యారని విమర్శించారు. దెయ్యాల మధ్య పదేళ్ల రాజకీయం ఎందుకని రఘునందన్ ఎద్దేవా చేశారు.

# కానిస్టేబుల్ బాలాజీని సన్మానించిన ఎస్ఐ కొండలరావు





**తల్లాడ/మే27(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ పోలీస్ స్టేషన్ నుండి ఖమ్మం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కి బదిలీపై వెళ్తున్న బాలాజీ నాయక్ కానిస్టేబుల్ కి మంగళవారం సన్మానం చేశారు. కానిస్టేబుల్ బాలాజీ నాయక్ ఎంతో హార్డ్ వర్కర్ ఎన్నో సందర్భాలలో ఎస్ఐ ,సిఐ ఖమ్మం జిల్లా అధికారులు ఏసిపి, సిపి, చేతులు మీదుగా రివార్డు తీసుకోవడం కూడా జరిగింది ఇలాంటి వ్యక్తులను మనం గుర్తించి సన్మనించడం జరిగిందన్నారు ఈ కార్యక్రమం లో, తల్లాడ ఎస్ఐ కొండలరావు,,,వైరా మాజీ మార్కెట్ చైర్మన్ దున్నేటి వీరారెడ్డి, కొత్త వెంకటగిరి మాజీ ఉపసర్పంచ్ దిరిశాల సత్యనారాయణ, కర్నేటి లక్ష్మారెడ్డి, రాయల గోవిందరావు, రాజశేఖర్ రెడ్డి, , వార్త విలేకర్ బొదురు, వెంకటేశ్వర్లు, రేగళ్ల శ్రీనివాసరావు, నారపోగు ప్రసాద్ బాబు, ఎల్లార్పు శీను, మేడి యాకోబు, తదితరులు పాల్గొన్నారు

# పోషకాహారం తీసుకోవాలి

## -డాక్టర్ ఐ రత్న మనోహర్



**తల్లాడ/మే27(జర్నలిస్ట్ వార్త):** ప్రతి ఒక్కరు పోషకాహారం తీసుకోవాలని డాక్టర్ ఐ రత్న మనోహర్ అన్నారు. తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఐ రత్న మనోహర్ ఆధ్వర్యంలో రైతు వేదిక నందు రైతులకు జీవన శైలిలో మార్పుల వల్ల వచ్చే వ్యాధుల గురించి వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగినది మంగళవారం రైతు వేదిక నందు హాజరైన రైతులకు రక్తపోటు పరీక్షలు డయాబెటిక్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు అనగా బీపీ షుగర్ పరీక్షలు చేయటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రైతులకు జీవనశైలిలో మార్పుల వల్ల వచ్చే వ్యాధులు అయినా గుండె జబ్బులు షుగర్ జబ్బులు క్యాన్సర్ జబ్బులు అల్సర్ మానసిక జబ్బులు వస్తున్నాయని కావున రైతులందరూ తమ యొక్క జీవన విధానంలో మార్పులు చేసుకొని మంచి పోషకాహారం తీసుకోవాలని తెలియజేయడం జరిగినది ముఖ్యంగా మాంసాహారం మద్యపానం ధూమపానమునకు దూరంగా ఉండాలని తెలియజేయడం జరిగినది అదేవిధంగా చిన్నచిన్న సమస్యలకు మనోవేదన చెందకుండా ప్రశాంతంగా జీవించాలని తెలిపారు. పంట పొలాలకు పురుగుమందులు చల్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్స్ భాస్కర్, పెద్ద పుల్లయ్య కమల భద్రమ్మ ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలుకుదాం

## -ఆంధ్రప్రదేశ్ ఎంఆర్ పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రోజు సురేష్ మాదిగ



**వేలేరు/మే27(జర్నలిస్ట్ వార్త):** పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగకు ఘనస్వాగతం పలుకుదాం మని ఆంధ్రప్రదేశ్ ఎంఆర్ పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రోజు సురేష్ మాదిగ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా వేలేరు మండలకేంద్రంలోని ఎస్ సి కాలనీలో ఎంఆర్ పి ఎస్ మండల అధ్యక్షులు హనుమకొండ మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి అనుబంధ సంఘాల నాయకులు కవులు కళాకారులు విద్యార్థులు మేధావులు అధికసంఖ్యలో హాజరై ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఢిల్లీలో రాష్ట్రపతి ముర్ము ద్వారా అత్యున్నతమైన పద్మశ్రీ పౌర పురస్కార అవార్డును తీసుకొని ఈనెల 31 న వరంగల్ కు వస్తున్న ఎం ఆర్ పి ఎస్ వ్యవస్థాప అధ్యక్షుకుడు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మంద కృష్ణ మాదిగకు ఎం ఆర్ పి ఎస్ ఆధ్వర్యంలో ఎం ఆర్ పి ఎస్, ఉపసంఘాలు మాదిగలు ఘనంగా స్వాగతం పలకడానికి పెద్ద ఎత్తున తరలి రావాలని ఆంధ్రప్రదేశ్ ఎం ఆర్ పి ఎస్ అధ్యక్షులు రుద్రోజు మాదిగ తెలిపారు. .ఈ కార్యక్రమంలో ఎంఎస్ పి రాష్ట్ర నాయకులు మంద రాజు మాదిగ , ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జన్ను దినేష్ మాదిగ ,ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు బండారి సురేందర్ మాదిగ ,ఎం ఆర్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు గద్దల సుకుమార్ మాదిగ ,కనుకం రాజయ్య, రామంచ యేసు, భట్టుధర్మేందర్ అక్కలశంకర్ చంద్రయ్య హరీష్ శ్రీను రాకేష్ వెంకటయ్య శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఈ-శ్రమ్ పోర్టల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని కార్డులు పొందాలి

## - ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి

**హనుమకొండ/మే 27(జర్నలిస్ట్ వార్త):** జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల కార్మిక ఉపాధి పనులు చేస్తున్నవారు ఈ-శ్రమ్ పోర్టల్లో రిజిస్ట్రేషన్ చేసుకుని, కార్డులు పొందాలని మంగళవారం కార్మిక శాఖ ఉప కార్మిక కమీషనర్, వరంగల్, ఎ.ఎస్. వినిత ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొరియర్, హెమ్ సర్వీసెస్, ఫుడ్ డెలివరి, ఏసీ టెక్నిషియన్స్, గ్రాఫిక్స్ డిజైనర్స్, వీడియో ఎడిటర్స్ వంటి విధులు చేసేవారు ఈ-శ్రమ్ పోర్టల్లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని కార్డు పొందాలన్నారు. కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ అమెజాన్, ఫ్లిప్కార్ట్, జొమాటో, స్విగ్గీ వంటి సంస్థలలో పనిచేసే వారిని కార్మికులుగా గుర్తిస్తూ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను వర్తింపచేస్తుందన్నారు. కార్మికులుగా పనిచేసే వారంతా ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏమైనా సందేహాలున్నా, వివరాలు కావాలన్నా హెల్ప్ లైన్ నెంబర్ 14434కి ఫోన్ చేసి వివరాలని తెలుసుకోవచ్చని తెలిపారు.

# కరోనా మరోసారి ప్రచారంలోకి వచ్చింది

- ప్రపంచ వ్యాప్తంగా ప్రజల్ని చావుదెబ్బ కొట్టింది
- అప్పుడు ఉన్నంత ప్రభావం ప్రస్తుతం ఉండదు
- ప్రజలు భయపడాల్సిన అవసరం ఏమీ లేదు
- కోవిడ్ వ్యాపిస్తే జాగ్రత్తలు ఏంటో ప్రజలకు తెలిసిందే
- లక్షణాలు ఏమైనా కనిపిస్తే క్వారంటైన్ ఒక్కటే మార్గం
- ఒకవేళ వరంగల్ ప్రాంతానికి వ్యాపించిన తగ్గేదేలే
- సరైన వైద్య సేవలు అందించేందుకు సర్వం సిద్ధం
- వరంగల్ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు



**వరంగల్/మే 27(జర్నలిస్ట్ వార్త):**
ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కరోనా వ్యాప్తి ప్రచారమౌతున్న సంగతి ప్రజలకు తెలుసని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు అన్నారు. మంగళవారం కరోనా వ్యాప్తిపై ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కరోనా వైరస్ ప్రస్తుతం వరంగల్ జిల్లాకు వ్యాపించలేదన్నారు. ఇటీవల సోషల్ మీడియా మద్యమాల్లో వస్తున్న వార్తా కథనాలకు అనుగుణంగా 2 రోజుల క్రితమే అధికార యంత్రాంగం అప్రమత్తమైందన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కరోనా వ్యాప్తి నివారణ కోసం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు చెప్పారు. కలెక్టర్ ఆదేశానుసారం జిల్లాలోని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్య శాఖ సిద్ధంగా ఉన్నట్లు వారు పేర్కొన్నారు. వరంగల్ జిల్లా ప్రజలు అంతగా




భయపడాల్సిన అవసరం ఏమీ లేదన్నారు. ప్రస్తుతం అక్కడక్కడ మత్రమే కరోనా వ్యాపించినట్లు సంకేతాలు వినిపిస్తున్నాయి తప్ప, వరంగల్ ప్రాంతానికి వ్యాపించిన సందర్భాలు ఎక్కడా లేవన్నారు. ఏది ఏమైనపటికీ కరోనా లక్షణాలు ఏర్పడితే ప్రజలు ఎలాంటి జాగ్రత్త చర్యలు పాటించాలో ప్రతి ఒక్కరికి తెలిసిందే అన్నారు. కచ్చితంగా క్వారంటెన్ లో ఉండాల్సిందేనని పేర్కొన్నారు. గతంలో ఒక్కసారిగా కరోనా వైరస్ వ్యాపించి ప్రపంచ దేశాలకి వణుకు పుట్టించి, చావు దెబ్బ కొట్టిందన్నారు. ఎంతోమంది వైరస్ కారణంగా ప్రాణాలు పోల్పోయిన సంఘటనలు ఉన్నాయని వివరించారు. వ్యాక్సినేషన్ అందుబాటులోకి వచ్చాక కరోనా వైరస్ కాస్త కుదుటపడిందని ఉన్నారు. కరోనా వైరస్ మరోసారి వ్యాప్తి చెందుతుందని ఇటీవల సంకేతాలు వినిపిస్తున్నాయి. అంతే తప్ప ప్రజలు హఠాత్తుగా భయపడి, నిబ్బర పోవలసిన అవసరమేమి లేదన్నారు. ప్రస్తుతం కరోనా వైరస్ అక్కడ ఇక్కడ వ్యాపించి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కేవలం సామాజిక మధ్యమాలు మాత్రమే వినిపిస్తోంది. ఏం జరిగినా ఇంతకు ముందు జరిగిన నష్టం ఏమీ ఉండదు. ప్రజలు భయపడవద్దు అన్నారు. అప్పుడు ఉన్నంత ప్రభావం ఏమి కనిపించే అవకాశం ఉండదన్నారు. తగిన వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోనే ఉంటాయని చెప్పుకొచ్చారు.

# ఎల్కుర్తి ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు

## చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్



**ధర్మసాగర్/మే27(జర్నలిస్ట్ వార్త):** అక్రమ సంపాదనకు అలవాటుపడిన కొందరు అక్రమ వ్యాపారులు ఎల్కుర్తిలో ప్రవేట్ ప్రభుత్వ భూమిలోని మట్టినీ వదలడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్కడపడితే అక్కడ మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. రాత్రివేళల్లో లారీల కొద్ది మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. హన్మకొండ జిల్లా ధర్మాసాగర్ మండలంలోని ఎల్కుర్తి గ్రామం నుంచి పెద్దఎత్తున మట్టి దందా జరుగుతోంది. అసైన్డ్ భూమిలో మట్టి తవ్వకాలు అడ్డగోలుగా జరుగుతున్నాయి. ఎల్కుర్తి, ధర్మాసాగర్ మండలకేంద్రానికి సమీపంలోని పలు వెంచర్లలో ఇక్కడి నుంచి మట్టి రవాణా చేస్తున్నారు. వెంచర్లలో మట్టి డంపులు కనబడుతుండడమే అందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు జరుపుతూ లారీల్లో, ట్రాక్టర్లతో హన్మకొండ, వరంగల్ శివారు ప్రాంతాల్లోని రియల్ వెంచర్లకు తరలిస్తున్నారు. ప్రభుత్వ భూమిలో మట్టిని అమ్ముకుని వ్యాపారులు రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. అర్ధరాత్రి దాటిందంటే లారీల కొద్దీ మట్టి తరలిపోతోంది. ఇంత జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్థానిక పోలీసులు రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామం

# అభివృద్ధి చెందుతుంది...

**అనంతగిరి:** మే27(జర్నలిస్ట్ వార్త):
పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ అనంతగిరి మండల అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. అనంతగిరి మండలానికీ సీఎం రిలీఫ్ ఫండ్ 49, కళ్యాణ లక్ష్మి 5 చెక్కులు మంజూరైనట్లుగా తెలిపారు. అనంతగిరి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన కొలిచలం ప్రసన్నకు మంజూరైన చెక్కును మంగళవారం ఆయన మండల నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... ఒక రూపాయి అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు... అవినీతి రహిత ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహాలక్ష్మీ పథకాన్ని ప్ర వేశపెట్టి అమలు పరుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చి న హామీలను నెరవేరుస్తుందన్నారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సారధ్యంలో అనంతగిరి మండలం ప్రతి గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. పూర్తిస్థాయిలో రహదారులు నిర్మాణం జరుగుతుందని ఆయన తెలిపారు. కోట్ల రూపాయల నిధులతో మండలాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ముస్కు శ్రీనివాస్ రెడ్డి,మాజీ ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు,బుర్ర పుల్లారెడ్డి,బాబు నాయక్,డేగ కొండయ్య,గుర్రం వెంకటరెడ్డి,బుర్ర నరసింహారెడ్డి,రవి, ధరావత్ సైదులు,మట్టపల్లి రామకోటయ్య,కిరణ్ రెడ్డి,షేక్ దస్తగిరి,వీరన్న,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# తరుగు పేరుతో

# 9 నుంచి 10 కిలోలు తీస్తున్నారు

- ఆవేదన వ్యక్తం చేస్తున్న కుర్నవల్లి గ్రామ రైతులు
- తక్షణమే ఉన్నత అధికారులు చర్యలు చేపట్టాలి
- రైతులను మోసం చేసేవారిని గుర్తించి శిక్షించాలి







**తల్లాడ/మే 27(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని కుర్నవల్లి గ్రామంలో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి తరలించి కక్కలేక, మింగలేక చస్తున్నారంటే నమ్మాలి. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని రైతుల ధాన్యం ఇండస్ట్రియల్ తరలిస్తే మిల్లర్లు అధికారులు కుమ్మక్కై రైతులను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరుగు పేరుతో 9 నుంచి 10 కిలోలు తీస్తున్నారు. కురుస్తున్న వర్షాల కారణంగా వాతావరణం అనుకూలించే ప్రసక్తే లేదని గ్రహించిన రైతులు కర్మ అనుకొని అధికారులు, మిల్లర్ల బెదిరింపులకు తలొగ్గుతున్నట్లు చెబుతున్నారు.




### అన్నదాతను మోసం చేయడం పాపం

దేశ వ్యాప్తంగా ప్రతి ఒక్కరి నోటికి 5 వేళ్ళు అందుతున్నాయంటే కేవలం అన్నదాత అయినటువంటి రైతు మాత్రమేనని రైతు సంఘాలు మాట్లాడుతున్నాయి. లాభాలను ఆశించకుండా వ్యవసాయం తప్ప మరో ఆలోచన లేకుండా తమ జీవితాలను సాగు కోసం అంకితం ఇచ్చిన రైతులు ప్రస్తుతం మోసపోతున్నారంటే కొంతమంది దుర్మార్గపు ఆలోచన కారణమని అంటున్నారు. అలాంటి వారి కారణంగా వ్యవసాయం అంటే విసుగు చెంది కొంతమంది భూములను అమ్ముకుని వ్యాపారాల వైపు మొగ్గ చూపారు. మరికొంతమంది రియల్ ఎస్టేట్ చేస్తూ రైతులకు ఆర్థిక అవసరాలను గుర్తు చేస్తూ తమ వద్ద భూములను లాగేసుకుని వెంచర్లుగా తయారు చేశారు.
ఫోను ఫోను కొంతమేర మాత్రమే వ్యవసాయం జరుగుతుంది. ఇందులో నాణ్యత లేని విత్తనాలు, నాణ్యతలేని మందులు, ప్రకృతి సహకరించకపోవడం, భారీ వర్షాల కారణంగా పంటలు నీట మునిగిపోవడం, సరైన సమయానికి కరెంటు ఉండి, లేక సాగునీరు అందకపోవడం, చిట్టచివరికి పండించిన పంటను అమ్ముకునే క్రమంలో దళారీ వ్యవస్థ రైతులను పూర్తిగా నష్టపెట్టడం ఇలా అనేక కారణాల వలన రైతులు వ్యవసాయం అంటేనే భయంతో పరిగెత్తే పరిస్థితులు సంభవించే ప్రమాదం ఉందని గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు జరుగుతున్న పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టి రైతులకు మోసం తలపెట్టే వారిని గుర్తించి చట్టపరంగా శిక్షించాలని కోరుతున్నారు. హఠాత్తుగా వాతావరణం లో మార్పులు చోటు చేసుకుని వర్షాలు విపరీతంగా కురుస్తున్నాయి. ప్రస్తుతం ఇప్పటివరకు కొనుగోలు పూర్తికాని ధాన్యం ఏమైనా ఉంటే ఆ రైతులను ఇబ్బంది పెట్టకుండా తక్షణమే కొనుగోలు ప్రక్రియను పూర్తిచేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

తల్లాడ మండలం కుర్నవల్లి గ్రామానికి చెందిన రైతు పోతురాజు కృష్ణ మాట్లాడుతూ ఐకెపి సెంటర్ పరిధిలోని సన్నాకారు, చిన్నకారు రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అధికారులు మిల్లర్లు కలిసి దళారీ వ్యవస్థను నిరూపిస్తున్నారని విమర్శించారు. గతంలో దళారీ వ్యవస్థను నిర్మూలించాలని ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సంగతి తెలిసిందే. కానీ ప్రస్తుతం బాధ్యతగా వ్యవహరించాల్సిన అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై పంటను మింగేయాలనుకోవడం దారుణమని అభిప్రాయపడ్డారు. కూటికోసం కోటి బాధలు పడి పంటలు పండిస్తే, తరుగు పేరుతో కిలోలకు కిలోలు తరుగు తీసి రైతులను ముంచే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతులను మోసం చేయాలని ప్రయత్నించే ప్రతి ఒక్కరిని శిక్షించాలని కోరారు.



పోతురాజు కృష్ణ



ఐలూరి రామిరెడ్డి,

# డయాగ్నస్టిక్స్ సెంటర్స్

# ఆశ్రయిస్తున్న బాధితులు

- ఒక్కరిపై వేల రూపాయల ఆర్థిక భారం - ఏ హాస్పిటల్ వెళ్లిన డయాగ్నస్టిక్ సెంటర్ వెళ్లాల్సిందే
- వైద్యం పేరుతో బహిర్గతమైన వ్యాపారం- డయాగ్నస్టిక్ సెంటర్ ఎదురుగా భోజనం చేస్తున్న బాధితురాలు



**వరంగల్/మే 27(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లాలోని బస్టాండ్ సమీపంలో ఓ డయాగ్నస్టిక్ సెంటర్ వద్ద ఓ బాధితురాలు కింద కూర్చుని హడావిడిగా భోజనం చేస్తోంది. ఆరోగ్యపరమైన సమస్యలు అలా ప్రజల్ని అతలాకుతలం చేస్తున్నాయంటే ఎవరికి నమ్మశక్యం కాదు. ఎందుకంటే మోసే వారికే తెలుస్తుంది కావడి బరువు అన్న చందంగా అనారోగ్య సమస్యలు తలెత్తి, ఏమాత్రం ఆర్థికం లేనప్పుడు అప్పులు చేసి, వైద్య పరీక్షలు చేసుకుంటున్నప్పుడు మాత్రమే అలాంటి పరిస్థితులు తెలిసి వస్తాయి. నిరుపేద కుటుంబాలకు ఇదొక అనుభవమని చెప్పాలి. మధ్యాహ్నం లంచ్ టైం కి డాక్టర్ వెళ్లిన సమయంలో హడావుడిగా ఆ బాధితురాలు భోజనం చేస్తుంది. ఎక్కడ త్వరపడి డాక్టర్ డయాగ్నస్టిక్స్ సెంటర్ వస్తారో? పేషెంట్ తాలూకు బంధువులు ఎక్కడ అంటూ ప్రశ్నిస్తారో? అన్న భయాందోళనలో ఆమె హడావిడిగా భోజనం చేయడం ఆ సమీపంలోని ప్రజల్ని ప్రభావితం చేసింది. ప్రభుత్వ హాస్పిటల్ వెళ్లిన, ప్రైవేట్ హాస్పిటల్ వెళ్లిన ప్రతి వ్యక్తికి బాడీ లోపల భాగాలు సరిగా ఉన్నాయా? లేదా? అన్న సందర్భంలో డాక్టర్లకు క్లారిటీ కోసమని డయాగ్నస్టిక్ సెంటర్ పంపిస్తారు. ఇదే అతనిగా తీసుకున్న డయాగ్నస్టిక్ సెంటర్ యాజమానులు రోగిని నిలువునా దోచేస్తున్నారు. ఎందుకు నిదర్శనంగా ఒక్కొక్కరి వద్ద వైద్య పరీక్షల పేరుతో వేలాది రూపాయలను దోపిడీ చేస్తున్నారని బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. పేదవారి కష్టార్జితం సరిపోకపోవడమే కాకుండా అప్పులు తెచ్చి వైద్య పరీక్షలు చేసుకుంటున్నారు. వేలాది రూపాయలు వెచ్చిస్తూ వైద్య పరీక్షలు చేసుకునే పరిస్థితి ఎందుకు దాపురించింది? ముమ్మాటికి ఈ పాపం ప్రభుత్వానికే వర్తిస్తుందని బాధిత వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. డయాగ్నస్టిక్ సెంటర్స్ సేవలను ప్రభుత్వ హాస్పిటల్లో ప్రభుత్వం ఎందుకు ప్రారంభించలేకపోతుందని ప్రశ్నిస్తున్నారు. వేల రూపాయలు అప్పులు చేసి ఆరోగ్య పరిస్థితిలను సరి చేసుకోవాల్సిన కర్మ పేద ప్రజలకు ఎందుకు శాపంగా తయారయ్యింది. సంరక్షిస్తారని నమ్మి పరిపాలన విధానాన్ని ఎంపిక చేసుకున్నప్పటికీ, ప్రజలకు ఎప్పటి చిప్ప ఏనుగులోనే అన్న చందంగా తరతరాలుగా సమస్యలు పేద ప్రజలని తరుముతూనే ఉన్నాయని బాధిత వర్గాలు ఆరోపిస్తున్నాయి. వైద్యం వ్యాపారంగా తయారైంది అనడానికి ఆశ్చర్యం లేకపోయింది. ఆర్ఎంపీ డాక్టర్ మొదలుకొని ఏ వైద్యశాలకు వెళ్లిన రోగానికి సంబంధం లేకుండా కచ్చితంగా డయాగ్నస్టిక్ సెంటర్ వెళ్లాల్సిందే. అక్కడ వారు ఏర్పాటు చేసిన ధరలు వెచ్చించి తీరాల్సిందే. అప్పుడు పంపించిన డాక్టర్ కమిషన్ తో పాటు డయాగ్నస్టిక్ సెంటర్ సంబంధించిన జిఎస్టి బిల్లులతో సహా బాధితుని వద్ద ముక్కు పిండి వసూలు చేయడం ఖాయం. యధావిధిగా పంపించిన డాక్టర్ కి కమిషన్ పంపిస్తూ, వైద్యాన్ని ఇలా బహిర్గతమైన వ్యాపారంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వం ప్రజలపై కనికరం చూపించకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితులు భారంగా తయారయ్యాయని బాధ్యత వర్గాలు అంటున్నాయి.

## సెప్టెంబర్ 15 వరకు ఐటీఆర్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ,మే27(జర్నలిస్ట్ వార్త): ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలుపై ఐటీ విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను రిటర్నుల దాఖలు తుది గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించినట్లు వెల్లడించింది. ఈ మేరకు ఐటీ- విభాగం కీలక ప్రకటన జారీ చేసింది. నిజానికి 2024-25 ఆదాయపు పన్ను దాఖలు చేసే తుది గడువు ఈ ఏడాది జులై 31తో ముగియనుంది. ఆ గడువును ఐటీ విభాగం తాజాగా సెప్టెంబర్ 15 వరకు పెంచింది. ఐటీఆర్ ఫారాల నోటిఫికేషన్ జారీ ఆలస్యం అయిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు- ఐటీ- విభాగం తెలిపింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి నోటిఫై చేసిన ఐటీ-ఆర్ ఫారాల్లో చేపట్టిన మార్పులకు అనుగుణంగా సిస్టమ్‌ను సిద్ధం చేయడానికి కొంత సమయం పడుతుందని, ఈ క్రమంలో ఎలాంటి అవాంతరాలు ఎదురు కాకుండా రిటర్నులు ఫైల్ చేయడం కోసం జులై 31తో ముగియనున్న గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగిస్తున్నట్టు- ఆదాయపు పన్ను శాఖ వెల్లడించింది.

# పేదల సంక్షేమ దిశగా

# పనిచేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్

### -ఎంపీ కడియం కావ్య





**ధర్మసాగర్/మే27(జర్నలిస్ట్ వార్త):** పేదల సంక్షేమ దిశగా పేద ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్త శుద్ధితో పని చేస్తున్నారని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు.మంగళవారం హనుమకొండ జిల్లాధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎంపీడివో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల మంగళవారం వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా . హాజరై ధర్మసాగర్, వేలేరు, కాజీపేట మండలాలకు సంబందించిన 18మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 18లక్షల 02వేల 088రూపాయల విలువగల చెక్కులను మరియు ధర్మసాగర్, వేలేరు మండలాలకు సంబదించిన 32మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 12లక్షల 75వేల 500రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని ప్రజా పాలనలోనే నిరుపేద వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేసే సంక్షేమ పథకాలను ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా అర్హులైన పేదలకు అందిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజల కష్ట సుఖాలలో పాలుపంచుకుంటున్నట్లు తెలిపారు. మీ అందరి సహకారంతో రానున్న రోజులలో మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, సదానందం ఎంపీడివో అనిల్ కుమార్ స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# తెలుగుదేశంలో కార్యకర్తే అధినేత





- పార్టీకి ప్రాణం, ఆయుధం కూడా కార్యకర్తలే.
- కార్యకర్తల త్యాగాలు వృథా కానివ్వం, అండగా ఉంటాం.
- అభివృద్ధి, సంక్షేమం, సంస్కరణలు, సుపరిపాలనకు టీడీపీనే ట్రెండ్ సెట్టర్.
- 'స్టేట్ ఫస్ట్' మన సంకల్పం- 'పాజిటివ్ పాలిటిక్స్' మన విధానం.
- బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందించిన ఏకైక పార్టీ టీడీపీనే.
- 45 రోజుల్లోనే కోటి సభ్యత్వాలు నమోదు చేసి రికార్డ్ సృష్టించాం.
- 1982 నుంచి నిన్నటి విధ్వంస పాలన వరకు మనది రాజీలేని పోరాటం.
- వచ్చే ఎన్నికల్లో కడపలో 10కి 10 అసెంబ్లీ స్థానాలు గెలుద్దామని పిలుపు.

**కడప మహానాడు తొలిరోజు ప్రసంగంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు.**

**కడపమే27(జర్నలిస్ట్ వార్త):**
కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలు సిసలైన అధినేతలని, పార్టీకి ప్రాణం-ఆయుధం కూడా కార్యకర్తలేనని టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విధ్వంస పాలకులను ఎదురొడ్డి పోరాడిన కార్యకర్తల త్యాగాలు వృథా కానివ్వమని, వారికి అండగా ఉండి సంక్షేమం అందిస్తామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం, సంస్కరణలు, సుపరిపాలనకు టీడీపీనే ట్రెండ్ సెట్టర్ అని, రాష్ట్రం ఫస్ట్ మన సంకల్పమని, పాజిటివ్ పాలిటిక్స్ మన విధానమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఒక ప్రాంతీయ పార్టీగా 45 రోజుల్లోనే కోటి సభ్యత్వాలు నమోదు చేసి రికార్డ్ సృష్టించిన ఏకైక పార్టీ తెలుగుదేశమని అన్నారు. 1982లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం మొదలు... నిన్నటి విధ్వంస పాలన వరకూ రాజీలేని పోరాటంచేశామన్నారు. మంగళవారం కడపలో జరిగిన మహానాడు తొలిరోజు సమావేశంలో ప్రారంభోపన్యాసాన్ని జై తెలుగుదేశం, జోహార్ ఎన్టీఆర్ నినాదాలతోముఖ్యమంత్రి చంద్రబాబు మొదలుపెట్టారు. అంతకుముందు, ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి, జ్యోతిని వెలిగించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ క్యాడర్‌ను ఉద్దేశించి ఉద్వేగంగా ప్రసంగించారు.

-ఈ మహానాడు చరిత్రలో నిలిచిపోతుంద.
ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా మహానాడు అంటే అదే జోరు. అదే హోరు. కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే నా మనసు ఉప్పొంగుతోంది. నాకు ప్రాణసమానమైన తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులందరికీ స్వాగతం. దేశంలో అనేక రాజకీయ పార్టీలున్నాయి. మహానాడులా వేలాదిమంది ప్రతినిధులతో మంచిచెడులు, విధానాలు, ఆలోచనలు చర్చించుకునే ఏకైక పార్టీ మాత్రం తెలుగుదేశమే. రాయలసీమలో మహానాడు అంటే తిరుపతిగా ఉండేది. తొలిసారి దేవుని కడపలో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలి మహానాడు కడపలో ఏర్పాటు చేశాం. కడప గడ్డపై ఈ మహానాడు చూస్తుంటే ఎన్నికలు అయ్యి ఏడాదైనా కార్యకర్తల్లో ఆ కసి, ఉత్సాహం, ఉద్వేగం ఏమాత్రం తగ్గలేదు. ఉమ్మడి కడపలో 10 కి ఏడుస్థానాలు గెలిచి సత్తాచాటాం. ఈసారి మరింత కష్టపడితే 10కి 10 మనవే.ఇప్పటి వరకూ మనం 34 మహానాడులు జరుపుకున్నాం. ఈ మహానాడు సువర్ణాక్షరాలతో చరిత్ర సృష్టించబోతోంది. ఏపీ ఆర్థిక పరిస్థితికి దశ దిశ నిర్ధేశిస్తుంది. గతంలో మహానాడు అంటే ఎండలు మండేవి. ఈసారి చల్లటి వాతావరణంలో మహానాడు జరుగుతోంది.

-కార్యకర్తల పోరాట ఫలితమే ఈ అద్భుత విజయం.
2024 ఎన్నికల్లో పార్టీ సాధించిన విజయం అసామాన్యం. 93 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో చరిత్ర సృష్టించామంటే అందుకు పసుపు సైనికుల పోరాటం, త్యాగాలే కారణం. జనసేన, బీజేపీతో కలిసి పోటీ చేయడం ఈ మహా విజయానికి దోహదం చేసింది. ఏమీ ఆశించకుండా దశాబ్ధాలుగా గ్రామాల్లో జెండా మోస్తున్న కార్యకర్తల వల్లే ఇక్కడ ఉన్నాం. దీన్ని ప్రతి నేత కూడా గుర్తుంచుకోవాలి. 43 ఏళ్ల ప్రస్థానంలో దేశంలో ఏ పార్టీ ఎదుర్కోని సంక్షోభాలు ఎదుర్కొన్నాం. పార్టీ పని అయిపోయిందని మాట్లాడినవారి పనే అయిపోయింది కానీ టీడీపీ జెండా రెపరెపలాడుతూనే ఉంది. నాటి ఎన్టీఆర్ చైతన్య రథం, నేను చేసిన వస్తున్నా మీకోసం పాదయాత్ర, లోకేష్ యువగళం వరకూ కార్యకర్తల్లో అదే స్ఫూర్తి.

## -గొంతు కోసినా జై తెలుగు దేశం అన్నారు.

పాలన అంటే హత్యా రాజకీయాలు, కక్ష సాధింపులు, వేధింపులు, తప్పుడు కేసులుగా గత పాలకులు మార్చారు. విధ్వంస పాలనతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. దీన్ని ప్రశ్నించిన టీడీపీ నేతలు, కార్యకర్తలను వెంటాడి వేటాడి ప్రాణాలు తీశారు. అక్రమ కేసులు పెట్టి వేధించారు. కానీ ఒక్క కార్యకర్త కూడా ఎత్తిన జెండా దించలేదు. ప్రశ్నించినవారి గొంతునొక్కేందుకు గొంతులు కోశారు. మన పసుపు సింహం చంద్రయ్య గొంతు కోస్తున్నా జై తెలుగుదేశం అని ప్రాణాలు వదిలాడు. ఎందరో కార్యకర్తలు ప్రాణత్యాగాలు చేశారు. వారి స్ఫూర్తి టీడీపీలో శాశ్వతంగా ఉంటుంది. ఎత్తిన జెండా దించని కార్యకర్తల త్యాగాల వల్లే కూటమి అధికారంలోకి వచ్చింది. మీ త్యాగాలకు మహానాడు వేదికగా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. మీ త్యాగాలు వృథా కానివ్వం. కార్యకర్తల కష్టాలను గుర్తిస్తాం. సంక్షేమం అందిస్తాం. వర్షాలు వస్తున్నా మహానాడు జయప్రదం చేయాలని వచ్చిన కార్యకర్తలను చూస్తుంటే ఆనందంగా ఉంది.

## -పాలనలో టీడీపీ ట్రెండ్ సెట్టర్.

దేశంలో అనేక పార్టీలు ఉన్నాయి. కానీ ప్రజల జీవితాలను ఇంతలా ప్రభావితం చేసిన పార్టీ మాత్రం టీడీపీనే. అటు తెలంగాణ నుంచి ఇటు ఉత్తరాంధ్ర వరకూ అభివృద్ధి అంటే టీడీపీ ఆవిర్భావం ముందు, తర్వాతగా చూడాలి. ఇది చరిత్ర చెప్పిన వాస్తవం. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలకు టీడీపీనే ట్రెండ్ సెట్టర్. టీడీపీ పాలనే బ్రాండ్ అంబాసిడర్. పటేల్ పట్వారీ వ్యవస్థ రద్దు నుంచి ఆడబిడ్డల ఆస్తి హక్కు వరకూ, బాలికా విద్యకు ప్రోత్సాహం నుంచి ప్రత్యేక మహిళా వర్సిటీ వరకూ, లోటు కరెంటు నుంచి మిగులు విద్యుత్ వరకూ రూ. 2 కే కిలో బియ్యం నుంచి పక్కా ఇళ్ల వరకూ, రూ.30 పింఛను నుంచి రూ.4 వేల పింఛను వరకూ, వంట కష్టాలను దీపం పథకం తప్పించడం నుంచి డ్వాక్రా సంఘాల సాధికారత వరకూ నిరుద్యోగ పరిస్థితులను నుంచి ఐటీ ఉద్యోగాలతో విదేశాల్లో సత్తా చాటే వరకూ, సీమలో రైతుల సాగునీటి కోసం తల్లడిల్లే పరిస్థితి నుంచి డ్రిప్ సబ్సిడీలతో సిరులు పండించే వరకూ, బడుగు బలహీన వర్గాలకు అధికారం చూపిన తొలి పార్టీ టీడీపీ. అడిగే పరిస్థితి నుంచి బీసీలు శాసించే పరిస్థితికి తెచ్చిన ఏకైక పార్టీ తెలుగుదేశం. ఒక వర్గం, ఒక ప్రాంతం అని కాదు ఏ అంశమైనా పసుపు జెండా పుట్టకముందు పుట్టిన తర్వాత అని గీత గీసి చెప్పే పరిస్థితి. మనందరం టీడీపీ రాజకీయ పాఠశాలలో విద్యార్థులమే.

## -నేను నిత్య విద్యార్థిని.

నేను నిత్య విద్యార్థిగా ఉంటాను. ప్రతిరోజూ నేర్చుకుని ప్రజలకు ఉపయోగపడతాను. కార్యకర్తలే నాకు ఆయుధాలు. మీరు నేనూ కలిస్తే ఆకాశమే హద్దుగా పనిచేయొచ్చు. పాజిటివ్ పాలిటిక్స్ మన విధానం, రాష్ట్రం ఫస్ట్ అనేది మన సంకల్పం. ప్రతిపక్షంలో అవినీతిపై పోరాడాము. అధికారంలోకి రాగానే అవినీతి రహిత పాలన అందిస్తున్నాము. ప్రజల ఆస్తులు, ప్రజల హక్కులకు రక్షణ కల్పించాం. ఇకపైనా చేస్తాం. భావితరాల భవిష్యత్ కు అవసమైన పాలసీలు తెచ్చాం. పాజిటివ్ పాలటిక్స్ తో రాజకీయాల్లో విలువలు పెంచిన పార్టీ టీడీపీనే. నేడు తెలుగు రాష్ట్రాల్లో వివిధ పార్టీల్లో టీడీపీ యూనివర్సిటీలో చదివిన విద్యార్థులే ఉన్నారంటే అదీ మన సత్తా. మనది మోస్ట్ సక్సెస్ ఫుల్ మోడల్. ప్రజలిచ్చిన తీర్పును ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రయోజనాలకే ఉపయోగించాం. సొంత అవసరాలకు వాడలేదు. వాడము. అదే టీడీపీ చిత్తశుద్ధి. మన పార్టీ విధానాలు, మన ఆలోచనలు దేశంలో ఇతర పార్టీలకు బ్లూ ప్రింట్ గా నిలిచాయి.

## -సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యం.

రాజకీయాల్లో సామాజిక న్యాయం టీడీపీ తెచ్చిన అతిపెద్ద విప్లవం. అట్టడుగు వర్గాలకు రాజకీయ అవకాశాలు ఇచ్చాం. 40 ఏళ్లకు ముందే బీసీలను రాజకీయాల్లో భాగస్వాములు చేశాం. ఇదే టీడీపీని తిరుగులేని శక్తిగా మార్చింది. మన తర్వాత దేశంలో అన్ని పార్టీలు బీసీలను గుర్తించే పరిస్థితి వచ్చింది. సంస్థాగతంగా దేశంలో బలమైన పార్టీ టీడీపీ. ఒక ప్రాంతీయ పార్టీగా పుట్టి కోటి సభ్యత్వాతలను 45 రోజుల్లోనే పూర్తి చేసిన ఏకైక పార్టీ టీడీపీ.

-జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర.
జాతీయస్థాయిలో కేంద్ర ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాల్లో టీడీపీ కీలకపాత్ర పోషించింది. వాట్ ఏపీ థింక్స్ టుడే... ఇండియా థింక్స్ టుమారో అనేది అనేక సార్లు నిరూపణ అయ్యింది. విద్యుత్ సంస్కరణలు, పీపీపీ విధానంలో మౌలిక సదుపాయాలు, ప్రజల వద్దకు పాలన, జవాబుదారీ వ్యవస్థ వంటివి దేశానికి పరిచయం చేశాం. ప్రస్తుత టెక్నాలజీ యుగంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పార్టీ విధానంలో నూతనత్వం తీసుకొద్దాం. కడప గడ్డపై జరుగుతున్న మహానాడులో అనేక నిర్ణయాలు చర్చించి భావితరాల భవిష్యత్‌కు కార్యక్రమ రూపకల్పన చేస్తాం. ఈ మహానాడు భవిష్యత్‌ను ఒక దశదిశా నిర్దేశించే విధంగా ఉండబోతోంది.




## -అభివృద్ధికి కేరాఫ్ ఏపీ కాబోతోంది.

స్వాతంత్రం వచ్చిన తర్వాత 78 ఏళ్లలో ఎంత అభివృద్ధి జరిగిందో రాబోయే 22 ఏళ్లలో అంతకుమించి రెట్టింపు అభివృద్ధి జరగబోతోంది. 2025 మహానాడు ఒక చరిత్ర తిరగరాయబోతోంది. మంత్రి లోకేష్ ఆరు శాసనాలతో ఒక బ్లూ ప్రింట్ విడుదల చేస్తారు. నేరస్థులు ఎక్కడున్నా వదిలిపెట్టే సమస్య లేదు. నదుల అనుసంధానం, పోలవరం పూర్తి చేసి జలహారతి ద్వారా ప్రతి ఎకరాకు నీరిచ్చి తెలుగు ప్రజల రుణం తీర్చేలా తీర్మానం చేస్తాం. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌కు నాంది పలుకుతాం. రోడ్లు, రైల్వే, పోర్టులు, ఎయిర్ పోర్టులు వంటివి చేసి ప్రపంచంలోనే లాజిస్టిక్ కాస్ట్ తగ్గేలా మన ఆలోచనలు ఉంటాయి. ఆ రోజు నేను హైటెక్ సిటీ నిర్మించి హైదరాబాద్ లో ఐటీ తెచ్చాను. ఈ మహానాడు ద్వారా క్వాంటమ్ వ్యాలీ, ఏఐకి ప్రాధాన్యత ఇచ్చి తెలుగుజాతిని ముందుకు నడిపిస్తాను. ప్రధాని నాయకత్వంలో వికసిత్ భారత్ తయారుచేస్తే మనం స్వర్ణాంధ్ర 2047 తెచ్చాం. 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ ధ్యేయంగా పెట్టుకుని ప్రతి ఒక్కరి ఆదాయం రూ. 55 లక్షలు ఉండేలా కార్యక్రమం రూపకల్పన చేశాం. ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు పెరగాలి. 2047 నాటికి జీరో పావర్టీ సాధించి దేశానికి ఒక దశదిశ నిర్దేశిస్తాం. ఆ తర్వాత పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తగ్గించే విధానానికి శ్రీకారం చుడతాం. అందరూ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండటం మన విధానం. రాబోయే పదేళ్లలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితినే కాదు మనం అనుకున్న విధానాలు అమలు చేసి వ్యవస్థనుగాడిలో పెట్టే బాధ్యత నాది. ప్రపంచంలోనే తెలుగు జాతి నెంబర్ వన్ గా చేసే బాధ్యత మనందరిదీ.



## -విధ్వంస పాలకులను ప్రజలు తరిమికొట్టారు.

గతంలో ప్రభుత్వాలు చేసిన అవినీతి ఒక ఎత్తయితే వైసీపీ చేసిన అవినీతి ఒక ఎత్తు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విధ్వంస పాలకుల స్కాములు లెక్కబెడుతున్నాం. విచారణకు ఆదేశాలిచ్చాం. ఎవరు అవినీతి చేసినా కక్కించే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది. ఎన్నికల్లో మనల్ని గెలిపించి అవినీతి పాలకులను ప్రజలు తరిమేశారు. అక్రమార్కులను శిక్షించే బాధ్యత మనకిచ్చారు. ప్రజా సంపద దోచిన వారిని, గాడి తప్పిన నేతలను, అధికారులను ఉపేక్షించం. తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు. మనం అధికారంలోకి వచ్చి ఏడాదయింది. ఏడాది క్రితం రాష్ట్రమంతటా సంక్షోభం. ప్రజలిచ్చిన అవకాశాన్ని బాధ్యతగా స్వీకరించాం. కేంద్ర సహకారంతో ఒక్కో ఇటుక పేర్చుతున్నాం. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. 2024లో వైసీపీని ను చిత్తుచిత్తుగా ఓడించాక ఏపీ ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. ప్రజల్లో అశాంతి పోయింది. ఎవరు ఏం చేస్తారో అనే అలజడి పోయింది. చీకటి తొలగి, భవిష్యత్ పై ఆశలు పెరిగాయి. ఓట్లేసి గెలిపించిన ప్రజల జీవితాలు బాగుచేస్తాం.

## -ప్రతి ఒక్కరికీ సంక్షేమం.

రోడ్లు, మౌలిక సదుపాయాలు, వ్యాపారాలు, పెట్టుబడులు, ఉపాధి, ఉద్యోగాలు, నోటిఫికేషన్లతో అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. 64 లక్షల మందికి రూ.4 వేలు, రూ.6 వేలు, రూ. 10 వేలు, రూ. 15 వేలు పింఛను ఇచ్చే ఏకైక రాష్ట్రం దేశంలో ఏపీనే. ఏటా రూ.33 వేల కోట్లు నేరుగా పేదల సేవలో మొదటి తారీఖున పేదలకు అదిస్తున్నాం. అన్నా క్యాంటీన్లతో పేదల ఆకలి తీరుస్తున్నాం. దీపం పథకంతో కోటి మందికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తాం.ఉచిత ఇసుక, మత్స్యకారుల సేవలో ఆర్థిక సాయం, అర్చకులు, ఇమామ్‌లు, పాస్టర్లకు గౌరవ వేతనాలు పెంచాం. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. స్కూళ్లు తెరిచేలోగా తల్లికి వందనం అందిస్తాం. సీమను హార్టికల్చర్ హబ్‌గా తయారుచేయడం, ఏపీలో ఆక్వా కల్చర్‌ను ప్రోత్సాహించడం చేస్తున్నాం. మిరప రైతులకు ఇబ్బంది వస్తే కేంద్రంతో మాట్లాడాం. కోకో రైతులకు ఇబ్బంది వస్తే సబ్సిడీ ఇచ్చాం. సీమలో మామిడి రైతులకు ఇబ్బంది వస్తే ఆదుకుంటున్నాం. పొగాకు రైతులను ఆదుకున్నాం.. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తాం. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. పారిశ్రామిక వేత్తలతో నమ్మకం కల్పించి పెట్టుబడులు తెస్తున్నాం. 11 నెలల్లో 6 స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డులు పెట్టి 76 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపాం. దీనివల్ల రూ.4 లక్షల 96 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చాము. 4 లక్షల 57 వేల మందికి ఉద్యోగాలు వస్తున్నాయి. రూ.10 లక్షల కోట్ల అప్పులు వారసత్వంగా వచ్చాయి. రూ.లక్షా 20 వేల కోట్ల బిల్లుల పెండింగ్ ఉన్నాయి. టీడీపీ మీద కక్ష గట్టి నీరు చెట్టు, నరేగా వంటి పనులకు బిల్లులు ఇవ్వలేదు. ఐటీ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో వాట్సాప్ గవర్నెన్స్ ,మన మిత్ర తెచ్చాం. ఇదో గేమ్ ఛేంజర్.

## -పహల్గాం మృతులు, వీర సైనికులకు నివాళి

మరోవైపు మహానాడుకు వచ్చిన టీడీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు సాంస్కృతిక కార్యక్రమాలు, మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. అనంతరం ఫోటోగ్యాలరీని తిలకించారు. రక్త దాన శిబిరంలో పాల్గొన్నారు. అలాగే సభ ప్రారంభమైన తర్వాతపహల్గాం మృతులకు, ఆపరేషన్ సిందూర్‌లో పోరాడి వీరమరణం పొందిన సైనికులకు సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అటు తెలుగుదేశం పార్టీలో మరణించిన వారికి కూడా సంతాపాన్ని వ్యక్తం చేశారు.








## పుష్పలో పాత్రను మిస్ చేసుకున్నా : నారా రోహిత్

నారా రోహిత్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. నారా చంద్రబాబు నాయుడు తమ్ముడు నారా రామమూర్తి నాయుడు కుమారుడైన రోహిత్ సినిమాల మీద ఆసక్తితో ఎప్పుడో బాణం అనే సినిమాతో హీరోగా లాంచ్ అయ్యాడు. ఆ తర్వాత చేసిన సోలో ఇలాంటి సినిమా ఆయనకు మంచి హిట్ వచ్చింది. ఆ తర్వాత చేస్తున్న సినిమాలన్నీ వైవిధ్యంగా ఉన్నా ఎందుకో హిట్స్ అందుకోలేకపోయాడు. అయితే ఆయన తాజాగా భైరవం అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సినిమాలో ఆయన మంచు మనోజ్, బెల్లంకొండ సాయి శ్రీనివాస్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నాడు. మే 30వ తేదీన ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న నేపథ్యంలో నారా రోహిత్ మీడియాతో ముచ్చటించాడు. ఈ సందర్భంగా అనేక విషయాలు పంచుకున్న ఆయన తాను పుష్ప లాంటి సినిమాను మిస్ చేసుకున్నట్లు- వెల్లడించాడు. తనను పుష్ప సినిమాలోని ఫహద్ ఫాజిల్ క్యారెక్టర్ కోసం ముందు అడిగారని, అయితే మాటలు జరుగుతున్న సమయంలోనే ఆ సినిమాను పాన్ ఇండియా సినిమాగా చేయాలని భావించి ఆ సమయంలో ఫహద్ ఫాజిల్‌ను సంప్రదించారని చెప్పుకొచ్చాడు. ఇక భైరవం సినిమా బాగా కుదిరిందని, తమిళంలో శశి కుమార్ చేసిన పాత్ర తాను ఇక్కడ పోషించానని చెప్పుకొచ్చాడు. కచ్చితంగా భైరవం హిట్ అవుతుందని నమ్మకం ఆయన వ్యక్తం చేశాడు. అలాగే తాను సుందరకాండ అనే సినిమాతో మరో నెల రోజుల్లో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు- వెల్లడించాడు.

# కన్నప్ప హార్డ్ డిస్క్ చోరీ

## అందులోనే ప్రభాస్ యాక్షన్ సీన్లు

మంచు విష్ణు హీరోగా తెరకెక్కుతున్న 'కన్నప్ప' సినిమాకు సంబంధించి ఓ కీలక పరిణామం చోటు- చేసుకున్న విషయం తెలిసిందే. కన్నప్ప చిత్రానికి సంబంధించిన ముఖ్యమైన దృశ్యాలు, డేటా ఉన్న హార్డ్ డ్రైవ్ మాయం అయినట్లు- చిత్రబృందం తాజాగా వెల్లడించింది. దీనికి సంబంధించి ఇప్పటికే 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీపై నిర్మాణ సంస్థ నమ్మక ద్రోహం కేసు కూడా నమోదు చేసింది. సినిమా ఎగ్జిక్యూటివ్ నిర్మాత రెడ్డి విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు ఫిల్మ్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలావుంటే మిస్ అయిన హార్డ్ డిస్క్‌కి సంబంధించి కీలక సమాచారం బయటపడింది. ఈ హార్డ్ డిస్క్‌లో సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ యాక్షన్ సీన్లు కూడా ఉన్నాయని తెలుస్తోంది. దీనిపై చిత్రబృందం ఇప్పటివరకు ఎటు-వంటి అధికారిక ప్రకటన చేయలేదు. 'కన్నప్ప' సినిమాలో ప్రభాస్ దాదాపు 30 నిమిషాల పాటు- కనిపించనున్నారని మంచు విష్ణు ఇటీ-వల వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో ప్రభాస్ 'రుద్ర' అనే శక్తివంతమైన పాత్రలో కనిపించబోతున్నారని, ఆయన స్క్రీన్-టైమ్ సినిమా కథను మలుపు



తిప్పే విధంగా ఉంటుందని చిత్ర బృందం చెబుతోంది. ముఖ్యంగా, మోహన్ బాబు, ప్రభాస్ మధ్య వచ్చే సన్నివేశాలు అత్యద్భుతంగా ఉంటాయని విష్ణు పేర్కొన్నారు. ప్రభాస్ యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని అభిమానులు కూడా భారీ అంచనాలు పెట్టు-కున్నారు. ఈ నేపథ్యంలో హార్డ్ డిస్క్ మాయం కావడంతో చిత్ర యూనిట్ తీవ్ర ఆందోళనలో ఉంది. హార్డ్ డిస్క్ బ్యాకప్ పెట్టు-కున్న కూడా.. ఎవరైనా ఆన్‌లైన్‌లో లీక్ చేస్తే.. ఎలా అని చిత్రబృందం ఆందోళన పడుతుంది.




# టెలిగ్రామ్ స్కామ్.. అలెర్ట్ చేసిన తెలుగు బ్యూటీ..

తెలుగు బ్యూటీ, హీరోయిన్ పూజిత పొన్నాడ గురించి అందరికీ తెలిసిందే. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటూ.. అప్డేట్స్ అండ్ పిక్స్ షేర్ చేస్తుంటుంది. మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ను సంపాదించుకున్న అమ్మడు.. తన పేరును ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్న టెలిగ్రామ్ స్కామ్ గురించి తాజాగా మాట్లాడింది. స్కామర్స్ పంపుతున్న మెసేజెస్ స్క్రీన్ షాట్స్ ను షేర్ చేసిన పూజిత.. ముగ్గురు ఇన్ స్టాగ్రామ్ అకౌంట్స్ ఫాలో అయితే రూ.180 డబ్బులు ఇస్తామని మోసం చేస్తున్నట్లు తెలిపారు. అస్సలు తాను టెలిగ్రామ్ లో లేనని క్లారిటీ ఇచ్చారు. ఇలా చేయమని ఎవరినీ ఎప్పుడూ అడగలేదని వెల్లడించారు. “డబ్బు కోసం నన్ను ఫాలో అవ్వమని టెలిగ్రామ్ లో సందేశాలు వస్తున్నాయని నాకు చాలా మెసేజ్ లు వస్తున్నాయి. ఇలాంటి స్కామ్ లా బారినపడొద్దు. నేను టెలిగ్రామ్‌లో లేను. దయచేసి ఫ్రీ గా వచ్చిన డబ్బుల కోసం వెంపర్లాడొద్దు. ఎవరూ మోసపోవద్దు” అంటూ పూజిత పొన్నాడ ఇప్పుడు సోషల్ మీడియాలో తెలిపారు. ఇక పూజిత కెరీర్ విషయానికొస్తే.. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జన్మించిన ఆమె, తన తండ్రి జాబ్ రీత్యా ఢిల్లీ, చెన్నై వంటి నగరాల్లో పెరిగింది. చెన్నైలోని %బా=వీ% ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ లో బీటెక్ పూర్తిచేశారు. ఆ తర్వాత టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో ఉద్యోగం చేశారట. 2015లో ఉప్మా తినేసింది అనే షార్ట్ ఫిల్మ్ తో సినీ ఇండస్ట్రీలోకి వచ్చిన పూజిత.. 2016లో ఊపిరి మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమాలో గ్యాలరీ మేనేజర్ పాత్ర పోషించారు. 2018లో వచ్చిన బ్లాక్ బస్టర్ హిట్ అయిన రంగస్థలం చిత్రంలో ఆది పినిశెట్టి ప్రియురాలి పాత్రలో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. 2019లో సీనియర్ నటుడు రాజశేఖర్ కల్కి మూవీలో ఎస్ఐ పాత్రలో మెప్పించారు. హ్యాపీ వెడ్డింగ్, రాజు గాడు, మిస్ ఇండియా, రావణాసుర, ఓదెల రైల్వే స్టేషన్ లో కనిపించారు. ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హరిహర వీరమల్లు మూవీతోపాటు. మరిన్ని సినిమాల్లో కూడా యాక్ట్ చేస్తున్నారు. మరి ఎలాంటి హిట్స్ అందుకుంటారో వేచి చూడాలి.

# త్వరలోనే పహల్గామ్ కు వెళతా

## : కమలహాసన్



ప్రముఖ సినీ నటుడు కమలహాసన్ తాజా చిత్రం ‘థగ్ లైఫ్’ విడుదలకు సిద్ధమవుతుతోంది. ఈ తరుణంలో ఆయన చేసిన వ్యాఖ్యలు సినీ, రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. జూన్ 5న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రచార కార్యక్రమాలను ఉద్దేశపూర్వకంగానే తగ్గించామని కమలహాసన్ స్పష్టం చేశారు. దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సంబరాలు చేసుకోవడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రస్తుతం ‘థగ్ లైఫ్’ సినిమా ప్రమోషన్లలో భాగంగా తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కమల్ పలు కీలక విషయాలను పంచుకున్నారు. మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శింబు, త్రిష వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సినిమా గురించి కమల్ మాట్లాడుతూ, “ ‘థగ్ లైఫ్’ చిత్రాన్ని అనేక భావోద్వేగాల సమ్మేళనంగా రూపొందించాం. చిత్ర బృందం మొత్తం ఎంతో కష్టపడి పనిచేసింది. ఈ సినిమా విజయం సాధించాలని కోరుకుంటున్నాను” అని తెలిపారు.

# రుక్మిణీ వెంటపడుతున్న అదృష్టం!

ఒకప్పుడు బాలీవుడ్ నుంచి .. కోలీవుడ్ నుంచి టాలీవుడ్ కి అందమైన భామలు క్యూ కట్టేవారు. ఆ తరువాత కాలంలో మలయాళ బ్యూటీలు తరలిరావడం ఎక్కువైంది. అయితే ఇటీవల కాలంలో మాత్రం కన్నడ నుంచి దిగుతున్న అందగత్తెల సంఖ్య కూడా పెరుగుతూ వెళుతోంది. అలాంటి వారి జాబితాలో ఇప్పుడు ఎక్కువగా రుక్మిణీ వసంత్ పేరు వినిపిస్తోంది. రుక్మిణీ వసంత్ పేరు వినగానే ‘సప్త సాగరాలు దాటి’ సినిమా గుర్తుకు వస్తుంది. ఈ కన్నడ హిట్ తోనే రుక్మిణి కెరియర్ జోరందుకుంది. చాలా సింపుల్ గా కనిపిస్తూనే, చూపులన్నింటినీ తన చుట్టూ తిప్పుకోవడం ఆమె ప్రత్యేకత. సహజమైన నటన .. హావభావ విన్యాసం ఆమెకి మంచి మార్కులు .. మరింత క్రేజ్ ను తెచ్చిపెడుతున్నాయి. దాంతో అదృష్టం కూడా ఇప్పుడు అందగత్తెల వెంటనే పడుతోందని అంతా చెప్పుకుంటున్నారు. ఆల్రెడీ విజయ్ సేతుపతితో కలిసి నటించిన రుక్మిణి, శివకార్తికేయన్ తో కలిసి ‘మదరాసి’లో నటించింది. సెప్టెంబర్ 5వ తేదీన ఈ సినిమా విడుదల కానుంది. ఇక ఎన్టీఆర్ తో ప్రశాంత్ నీల్ తెరకెక్కించనున్న ‘డ్రాగన్’ సినిమాలో కూడా ఈ భామ పేరే వినిపిస్తోంది. అలాగే త్రివిక్రమ్ - వెంకటేశ్ కాంబినేషన్లోను, సందీప్ రెడ్డి వంగా - ప్రభాస్ కాంబినేషన్లోను ఆమె పేరు వినిపిస్తోంది. చూస్తుంటే రుక్మిణీ వసంత్ కన్నడలో కంటే ఎక్కువగా తెలుగులో బిజీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి మరి!



# ‘స్పిరిట్’ స్టోరీ లీక్... ‘డర్టీ పీఆర్ గేమ్స్’ అంటూ

## దీపిక పీఆర్‌పై సందీప్ రెడ్డి వంగా ఆగ్రహం!





రెబల్ స్టార్ ప్రభాస్, ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో ‘స్పిరిట్’ అనే సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ మూవీలో మొదట దీపిక పదుకొణెని హీరోయిన్‌గా అనుకున్న సందీప్ రెడ్డి.. ఆ తర్వాత ఆమెను తీసేశారు. దీపిక అనేక కండిషన్లు పెట్టడం వల్లే ఆమెకు సందీప్ గుడ్ బై చెప్పేశారని వార్తలొచ్చాయి. తాజాగా దీపిక స్థానంలోకి యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రీని తీసుకున్న సంగతి తెలిసిందే. దీనికి ప్రతి చర్యగా ఆమె పీఆర్ టీం స్పిరిట్ స్టోరీని లీక్ చేసినట్లు సమాచారం. దీంతో దీపిక పదుకొణె, ఆమె పీఆర్ టీమ్‌పై సందీప్ రెడ్డి వంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘డర్టీ పీఆర్ గేమ్స్’ అంటూ ‘ఎక్స్’ (గతంలో ట్విట్టర్) వేదికగా సందీప్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. “మీరు ఇలా ఏం చేసినా నన్ను ఏం చేయలేరు.. ఈ సారి మొత్తం స్టోరీని లీక్ చేసుకోండి” అంటూ ట్వీట్ చేశారు. ఇదేనా మీ ఫెమినిజం అంటూ సందీప్ రెడ్డి వంగా కౌంటర్లు కూడా వేశారు. ఈ మేరకు దర్శకుడు ‘ఎక్స్’లో పెట్టిన పోస్టు ఇప్పుడు వైరల్‌గా మారింది. “నేను ఓ నటికి కథ చెప్పినప్పుడు.. ఆమెపై వంద శాతం నమ్మకంతో చెబుతాను. మా మధ్య నాన్ డిస్క్లోజర్ అగ్రిమెంట్ ఉంటుంది. కానీ మీరు ఇలాంటి వ్యవహారాలు చేసి మీది మీరే బయటపెట్టుకుంటున్నారు. ఓ యంగ్ నటిని కిందకు లాగడం, ఆమెను విమర్శించడం, నా స్టోరీని లీక్ చేయడం.. ఇదేనా మీ ఫెమినిజం. ఒక సినిమా కోసం ఎన్నో ఏళ్లు కష్టపడాల్సి వస్తుంది. నాకు సినిమానే ప్రపంచం.. మీకు ఇది అర్థం కాదు. ఎప్పటికీ అర్థం చేసుకోలేరు కూడా. మొత్తం కథను బయటపెట్టేసినా నాకు పోయేదేమీ లేదు” అని సందీప్ రెడ్డి వంగా ట్వీట్ చేశారు. దీనికి ‘డర్టీ పీఆర్ గేమ్స్’ అంటూ హ్యాష్ ట్యాగ్‌ని జోడించారు. అలానే తన దైన స్టయిల్‌లో హిందీలోని ఓ డైలాగ్‌ని కూడా పంచుకున్నారు.